# Telugu Jyothi

# తెలుగు జ్యోతి

A Literary Magazine from
The Telugu Fine Arts Society

తెలుగు కళా సమితి వారి
సారస్వత పత్రిక

http://www. tfasnj.org    http://www.TeluguJyothi.com    January – February 2015




# DENTISTRY FOR THE ENTIRE FAMILY

Member of ADA, NJDA & AEGD

## DENTAL ILLUMINATIONS

### Madhavi V. Kadiyala DDS & Associates

### General and Cosmetic Dentistry

- Digital Radiography X-Ray with Less Radiation
- Oral Hygiene, Sealants. Fluoride
- Bonding, Porcelain Veneers & Lumineers
- Teeth Whitening
- Periodontal Treatment
- One Visit Root Canals
- Metal Filling Replaced with White Restorations
- Surgical & Non Surgical Extractions
- Porcelain Crowns, Bridges & Complete Dentures

**Walk-ins & New Patients Welcome    Most Insurance Plans Accepted**

**Please Call For Appointments at Two Convenient Locations**

660 Princeton Meadows
Shopping Center,
Plainsboro Road
**Plainsboro, NJ 08536**
609-275-9688

Hopewell Crossing
800 K Denow Road
(Next to Stop & Shop)
**Pennington, NJ 08534**
609-303-0571

# PLAINSBORO PRINCETON MEDICAL ASSOC.

**Dr. Aruna Chakrala, MD**
BOARD CERTIFIED INTERNAL MEDICINE

**Dr. Sureka Reddy, MD**
BOARD CERTIFIED FAMILY MEDICINE

**Dr. Sangeeta Buddala, MD**
BOARD CERTIFIED INTERNAL MEDICINE

**Dr. Pramila Veera Swamy, MD**
BOARD CERTIFIED INTERNAL MEDICINE

***OPEN 7 DAYS A WEEK!***

Blood Draws • 2D Echo Cardiograms • EKG • All Immunization Including Travel Vaccines • Minor Skin Procedures Including Wart Removals, ***LASER SERVICES,*** Dietician, Diabetic Management, Joint Injections, Pap Smears

666 Plainsboro Road, Suite 1020 • Plainsboro, NJ 08536

***CALL TODAY 609-799-5000***

**OFFICE HOURS: MON-FRI 8AM-8PM, SAT & SUN 8AM-2PM**
**LANGUAGES: ENGLISH, TELUGU, HINDI, MARATHI, SPANISH**
**AGE GROUPS : 8 YEARS & ABOVE**

# తెలుగు కళా సమితి

**The Telugu Fine Arts Society, Inc**
(A tax exempt and not for profit corporation)

54 Erie Ave, Rockaway, NJ 07866

# తెలుగు జ్యోతి

సంపుటి: 32 సంచిక: 1

జనవరి – ఫిబ్రవరి 2015



**Board of Trustees**
**April 2014 – March 2016**

**President**
***Srini Gandi***
208 Margaret Ct, South Plainfield, NJ 07080
(732) 221-8017
president@tfas.net

**Vice-President**
***Guru Alampalli***
23 Harold Ave
Edison, NJ08820
(732) 277-8870
vicepresident@tfas.net

**Secretary**
***Uma Makam***
13 Alexis Lane,
Edison, NJ 08820
(732) 983-1936
secretary@tfas.net

**Treasurer**
***Vasant Naidu Tanna***
287 Pinelli Drive
Piscataway, NJ 08854
(732) 319-8155
treasurer@tfas.net

**Annual Events**
***Sreedevi Jagarlamudi***
*(732) 470-7055*
events@tfas.net

**Youth Services**
***Bindu Madiraju***
(732) 609-1836
youth@tfas.net

**Membership Services**
***Vamsi Koppuravuri***
1 Newburgh Drive,
Edison, NJ - 08820
(732) 429-4421
membership@tfas.net

**IT Services**
***Madhu Rachakulla***
(913) 220-9172
info@tfas.net

**Community Affairs**
***Madhu Anna***
(201)674-5477
community@tfas.net

**Advisors**
***Dr. Ramakrishna Seethala***
***Dr.Suneetha Kanumuri***
**Mr. Rohinikumar Vemula**

**Founder Editor:**
**Late Kidambi Raghunath**



**Editor: Diwakar Peri**, Phone (732) 329-3464
Mail articles to: 29 Yorktown Road, Monmouth Jn. NJ 08852 or diwakar.peri@gmail.com

**Associate Editors:** **Anantha Sudhaker Uppala** Production Support; **Radha Kasinadhuni** - Essays & Community News; **Syamaladevi Dasika** - Stories; **Dr. Vaidehi Sasidhar** – Poems.
**Madhu Anna** and **Guru Alampalli** representing TFAS Board of Trustees.


## మా మాట

"అమ్మల గన్న యమ్మ - ముగురమ్మల మూలపుటమ్మ" అంటూ మనం ప్రార్థన చేసే పరదేవతా స్వరూపమే మన ఇంట్లో మనకి అమ్మగా, మన పిల్లలకి తల్లిగా వుంది. మృత్యువుని ఎదిరించి మనకి జన్మనిచ్చిన తల్లి, మన అభివృద్ధిలోనే తన సంతోషాన్ని చూసుకునే అమ్మ అంటేనే ప్రేమ, ఓదార్పు, ధైర్యం. అలాంటి మాతృమూర్తికి సమర్పించిన వందనమే వాయుపురాణాంతర్గతమయిన "మాతృషోడశి". దీనికి తెలుగుసేత "మాతృవందనం". పదహారు సంస్కృతశ్లోకాలకి, బాపుగారు గీసిన చక్కటి చిత్రాలతో రమణగారి చిక్కటి తెలుగువ్యాఖ్యలకి బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గారు చేసిన భాష్యంతో వున్న ఈ పుస్తకాన్ని శ్రీ వర ప్రసాద్ గారు (శాంతా బయోటెక్) తెలుగులో ప్రచురించారు. మనకి ఈ జీవితాన్నిచ్చిన అమ్మకి తిరిగి మనం ఏమివ్వగలం? ప్రేమించడం తప్ప. ప్రతీ కొడుకూ, కూతురూ తప్పక చదవదగిన పుస్తకం. మాతృమూర్తి గొప్పతనాన్ని ముఖ్యంగా స్త్రీఔన్నత్యాన్ని పతాక స్థాయిలో ఎగరేసిన ఈ పుస్తకం ప్రతీ ఇంట్లోనూ చదవబడాలి. మన పిల్లలకి నేర్పబడాలి. అమ్మ గురించి ఆలోచించినప్పుడు మన తరానికి, వయోభారంతో నడవలేని, తన పని తాను చేసుకోలేని అమ్మ గుర్తొస్తుంది. ఇంటిల్లిపాదికీ తెల్లారినది మొదలు పొద్దుగూకే దాకా సేవలు చేసిన అమ్మ ఇవాళ ఇతరుల సాయంలేకుండా రోజు గడపలేకపోతోంది. జీవనోపాధి కోసం రోజంతా బయట గడిపే కొడుకులూ, కూతుళ్ళూ అమ్మకి ఎలా సేవ చెయ్యాలో అర్థం కాక తల పట్టుకుంటారు. ఇంత బ్రతుకూ-బతికి అమ్మని వృద్ధాశ్రమాల పాలుచెయ్యటమా అని వ్యధ చెందే పిల్లలకికీ, పిల్లల్ని బాధపెట్టలేక, వృద్ధాశ్రమానికి పోలేక సందిగ్ధావస్థలో కొట్టుమిట్టాడే అమ్మలకి సమ్మతంగా, "సమయోచితం"గా

## విషయసూచిక


| | | |
|---|---|---|
| మామాట | | 3 |
| TFAS President's Message | | 5 |
| మంచు కురిసిన వేళ | శ్రీమతి కేతవరపు రాజ్యశ్రీ | 5 |
| తెలుగు పాట | డా. వడ్డేపల్లి కృష్ణ | 6 |
| చిక్కులు పడిన దారం | తుమ్మూరి రామ్మోహనరావు | 9 |
| గోదా కల్యాణం | దూపాటి శేషు కుమారాచార్యులు | 9 |
| మంచు కురిసిన వేళ | శ్రీమతి సరోజా కృష్ణ | 9 |
| కథలూ- కబుర్లూ | డా. వై. వి. రమణ | 10 |
| పరిష్కారం | శ్రీమతి మంథా భానుమతి | 15 |
| ప్రసాదింట్లో పిడుగుపడింది | డా.గిరిజా శంకర్ | 24 |
| సమయోచితం | శ్రీమతి భావరాజు భారతి | 27 |
| బీదరికపు నిర్మూలన | డా. గవరసాన సత్యనారాయణ | 29 |
| తెలుగు సాహిత్యంలో స్త్రీపాత్రలు నాడు – నేడు | డా. ముక్తేవి భారతి | 34 |
| అందరూ ఒకేలా ఉండరు | శ్రీమతి ప్రమీల | 36 |


కవర్ పేజీ: **"సంక్రాంతి రంగవల్లులు"**

శ్రీమతి భావరాజు భారతిగారి రచనని అందిస్తున్నాం. ఈ సమస్యని ఇంకో కోణం లొ దర్శించే కథ శ్రీమతి మంథా భానుమతి గారి రచన "పరిష్కారం". మనకన్నా ముందు ఈ దేశం వచ్చి, మనకి మార్గదర్శనం చేసిన తోలితరం సమస్యలు నవతరానికి తెలియవు. ఈ దేశంలో జీవితపు మలిసంధ్యలో వచ్చే సమస్యలు-వాటి పరిష్కారాల గురించి ఈ పెద్దలే మనకి మార్గదర్శనం చెయ్యాలి. సమస్య అర్థమయితే సగం పరిష్కారం లభించినట్లే. ఈ రూపేణా అయినా సీనియర్లు-జూనియర్లతో ఆలోచనల్ని పంచుకుంటారని ఆశిస్తున్నాను. నా మాటలు "అడవిలో పాడిన పాటలు" కాకూడదని ఈ కొత్త సంవత్సరంలో ఆశిస్తూ ...

భవదీయుడు దివాకర్ పేరి


The articles published and the views expressed are those of the authors and not necessarily reflect the opinions of the editors or TFAS.



Dear Friends and Members of TFAS,

మీ అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు. As many of you aware, TFAS conducted 2015 Sankranti Celebrations on January 25th 2015 at the Bridgewater Temple as a main youth event. Entire executive committee worked hard in making the event successful! Everyone enjoyed full day program with over 400 people attending the event. Over 200 children and adults participated in a variety of programs. We conducted competitions in TELUG speaking, poem recital, reading, Rangoli, Bommala Koluvu, Vantakaalu, Posters, Fancy dress and many more. Many youth volunteers have enthusiastically participated and helped in conducting this program. I want to thank everyone who helped us in making this program successful!! We are also in the midst of planning for couple of events. Auditions for E-Tv, Paadutha Teeyaga, to be conducted on March 14th, the annual Thrimurty Day (a classical musical event) on March 15th in partnership with the Bridgewater Temple. Enrollment details for these events will be published on our website, www.tfas.net. We are also busy working on 30th anniversary celebrations around Memorial Day.

I am looking forward to seeing you all at our next programs. Please visit www.tfas.net for updates and look forward for your participation and support. Again, Thank you for your continued support in making TFAS programs successful!

Yours sincerely,
Srini Gandi
President TFAS

## Samkranti function Accounts

| INCOME: | |
|---|---|
| Registrations & Fees: | $2,238 |
| Donations: | $400 |
| **Total Income** | $2,638 |
| | |
| **Net Income** | $60 |

| EXPENSES: | |
|---|---|
| Auditorium : | $800 |
| Food & Misc : | $605 |
| Participation Medals: | $525 |
| Winner Prizes | $648 |
| **Total Expenses:** | $2,578 |

## Rangoli Winners

| Rangoli (Adult) | |
|---|---|
| First Place | Vani Dharmaji |
| Second Place | Sucharita Gaddam |
| **Rangoli (Juniors)** | |
| First Place | Kruthika Chintamani |
| Second Place | Aruhi Vakkalagadda |
| **Rangoli (Sub Juniors)** | |
| First Place | Anusha Vakkalagadda |

### మంచు కురిసిన వేళ

శ్రీమతి కేతవరపు రాజ్యశ్రీ

"మంచుపూల వాన" అని విన్నా
కవుల కల్పన అనుకున్నా
కనులారా నేడు కన్నా
తనివి తీరా స్నానించా
తన్మయత్వం పొందా.
నల్లని కురులపై వాలిన
తెల్లని హిమబిందువులు
నక్షత్రాల్లా మెరుస్తూ మల్లెలను
ధిక్కరించడం
అబ్బురంగా చూశా!
"పిండార బోసినట్లుంటుంది వెన్నెల"ని
చదివా
మంచు దుప్పటి కప్పుకున్న నేల
వెన్నెలని ధిక్కరించడం నేడు చూశా.
ఎండా వానా కలయికలో
ఏడు రంగుల హరివిల్లు చూశా
చల్లని మంచు నేలను ముద్దాడాలని
చెట్ల గుబురుల్లోంచి తొంగిచూస్తున్న
గోరువెచ్చని సూర్యుడి తహతహలో
వింత సొగసులు నేడు తిలకించా!
ప్రకృతీ !
నీ సొగసులు
తరచి చూసిన కొలదీ
తనివి తీరని మధురిమలు.

తెలుగు జ్యోతి ప్రకటన దారులను ప్రోత్సహించండి !!!
ఆర్థిక పరిపుష్టికి సహకరించండి !!!


Stephen R. Shapiro, MD
Lawrence S. Kluger, MD
Jeffrey S. Unger, MD
Surya P. Irakam MD FACP, FACG
Robert S. Wiesen, MD
Gastromed Healthcare, P.A.
Excellence in Gastroenterology
PREVENTION & TREATMENT OF DIGESTIVE DISEASES:
• Abdominal Pain Evaluation
• Acid Reflux & Ulcer Treatment
• Liver Disease Treatment & Evaluating
• Colon Cancer Screening
• Gastrointestinal Bleeding Management
• Hemorrhoid & Fissure Treatment
• Irritable Bowel Syndrome
• Ulcerative Colitis & Crohn's Disease
• Gallstones & Gall Bladder Disease
• Pancreatic Diseases
www.gastromedhealthcare.com
Gastromed@aol.com
286 East Main Street, Somerville, NJ
(908) 231-1999
515 Church Street, Bound Brook, NJ
(732) 356-0420
203 Towne Center Dr., Hillsborough, NJ
(908) 359-1639
1140 Stelton Rd., Suite 101, Piscataway, NJ
(732) 339-8810

# తెలుగు పాట

డా. వడ్డేపల్లి కృష్ణ

**డా. దాశరథి** (1927–1987): నిజాం నిరంకుశత్వాన్ని పద్యాగ్ని ధారతో నిరసించిన దాశరథి గారు తదుపరి 'రుద్రవీణ' ను మీటారు. అనేక పద్యకావ్యాలతో పాటు 'గాలిబ్ గీతాలు'నూ అనువదించారు. అయితే 'గాలిబ్ గీతాలు' తేట గీతులే. కానీ గేయాలు కావు. కావున వాటిని స్పృశించకుండా ఆ తరవాత వెలువరించిన 'నవ మంజరి' (లలిత గేయాల సంపుటి) ని మాత్రం విపులంగా పరిశీలించడం జరిగింది. ముందుగా పద్య, గేయ సమ్మిళితమైన 'రుద్రవీణ' లోని గేయాలనువివరిస్తాను. ఇందులో 'రానున్నది' అనే గేయంలో

'రానున్నది యేది నిజం?
అది వొకటే, సోషలిజం!
కలపండోయ్ భుజం భుజం
కదలండోయ్ గజం గజం
అడుగడుగున యెదనెత్తు
మడుగులుగా నిలవండోయ్!

అంటూ రానున్నది సమసమాజ భావాలతో కూడుకున్న సోషలిజమని, అదే నిజమని నొక్కి చెప్పారు. ఆ సోషలిజం స్థాపన కోసం భుజం-భుజం కలిపి, అడుగు,అడుగు ఎడంతో పరుగులా పదమంటూ యువతకు దారిచూపారు. 'గజం గజం' అనే పదం 'భుజం భుజం' ప్రాసగా ప్రయోగించినా శబ్దంతో పాటు అర్థమూ రెట్టింపవుతుంది.

నీలో దీపం వెలిగించు
నీవే వెలుగై వ్యాపించు!
శాంతి మంత్రమున ప్రేమ తంత్రమున
జనకల్యాణము సాధించు
దైన్యము మాని ధ్యానము పూనీ
దైవ సన్నిధిని జీవించు!
హృదయములో అమృతముతో
సదయుడవై విహరించు

అని దీపం వెలిగించుమనడమే గాకుండా, ఆ వెలుగు నీవేయై వ్యాపించమనడం అద్భుతంగా ఉంది.హృదయంలో దయామృతం కలిగి జీవించమనడం శాంతి ప్రేమలను స్థాపించమనడం ఈ గేయం ప్రత్యేకత.అనేకసార్లు ఆకాశవాణి ద్వారా ప్రసారమై శ్రోతల మన్ననలందుకున్న లలితగీతమిది. భారతీయతను గర్వంగా గానం చేసేం దుకు అల్లిన 'భారత జాతి' గేయంలో (పుట: 16 )

భూధరమో సాగరమో
భూతలమో ఆకసమో
భరత ధరణి నా గృహం
భరత జాతి నా అహం ||భూ||
మహా బోధి నీడలోన
మహిమగనిన గౌతముడు
అన్ని దేశముల యందున
అందరిలో ప్రియతముడు ||భూ||
అహింసతో హృదయాలను
అవలీలగ జయించిన
మహాత్ముడే దేశానికి
మహనీయ దయాజ్యోతి ||భూ||

అని త్రిశ్రగతిలో భరతభూమిని తన గృహంగా, భరతజాతిని తన అహంగా చాటుకున్నారు. రామునితో, అర్జునునితో భారతం ప్రసిద్ధి కెక్కగా గౌతముడు అహింసతో ఖండాంతర ఖ్యాతి గాంచినట్లుగా, మహాత్మాగాంధీ దేశంలో దయాజ్యోతిగా వెలుగొందినట్లు అభివర్ణించబడిన ఈ గేయం అనేక సార్లు 'లలిత సంగీతం'లో ప్రసారమైంది. దాశరథి గారు 'వదిన' , వనరాణి' గూర్చి గేయాలు అల్లినట్లే తన రాణి గురించి కూడ గేయరచన చేశారు. 'నా రాణి' గేయంలో (పుట:25 )

తలనిండ పూదండ దాల్చిన నా రాణి
మొలక నవ్వులతోడ మురిపించబోకే
నీ మాట బాటలో నిండే మందారాలు
నీ పాట తోటలో నిగిడే శృంగారాలు
నీ మేనిలో పచ్చ చేమంతి అందాలు
నీ నీలవేణిలో నిలిచే ఆకాశాలు ||త||

అని మొలక నవ్వుల తన రాణి తలనిండా పూదండతో మాట-పాటల్లో మైమరిపింప చేస్తుందని వర్ణించారు. ఆమె మాటల్లో

మందారాలు, పాటల్లో శృంగారాలు నిండినట్లుగానూ వెల్లడించారు. పసిడిరంగు మేనిని చేమంతులతో, నీలవేణిని నీలాకాశంతో మనో హరంగా పోల్చారు. ఖండగతిలో కమనీయంగా సాగిన గేయమిది. కావున ఘంటసాల గళంలో ఎల్.పి. రికార్డుగానూ మారుమోగింది. మామిడి మల్లెకు గల ప్రేమను నిర్వచిస్తూ అల్లిన 'మామిడి – మల్లె' అనే గేయంలో (పుట: 29 )

మామిడి కొమ్మా మల్లియ రెమ్మా
మంతన మాడెనదే!
కోయిల కొమ్మా మన చిలుకమ్మా
పాటలు పాడెనిదే !
..............................................
యువతీ యువజన నవ హృదయమ్ముల
ప్రవిమల రాగమదే!
నవ కిసాలముల మధు రసాలముల
వసంత యాగమిదే!

అని మామిడిని ప్రేమికుడిగా, మల్లెను ప్రేయసిగా కలిపి మంతనా లడినట్లు వర్ణించారు. కోయిల–చిలుక పాటలు పాడినట్లుగా ఊహిం చారు. కాననకాంత కంఠంలో కాంచనమాలలు ధరించి మన్మ ధరాజుతో కలిసి విచ్చేస్తే ప్రకృతి స్వాగతం పలికినట్లుగా చమత్కా రించారు. లేతఎరుపు మావిచిగుళ్ళలా యువతీయువకుల హృద యాల్లో రాగోదయం జరిగినట్లుగా భావించారు. ఇదే గీతాన్ని స్వల్ప మార్పులతో 'రాము' అనే చలన చిత్రంలోనూ వినియో గించారు. రైతుకు అగ్రస్థానం కల్పిస్తూ, సేద్యం చేద్దాం రమ్మంటూ ఎలుగెత్తిన గీతం 'కాహళం' (పుట: 35 )

ఒత్తవోయ్ కాహళం – ఎత్తవోయీ హలం
దున్నవోయీ పొలం – శ్రమయే మన బలం ||ఒత్త ||
రైతుదే ఈ దేశం, వినుమాతని ఆదేశం
మానవోయి ఆవేశం, ఇదె గాంధీ సందేశం ||ఒత్త ||

కష్టించి పండించే కర్షకులదే ఈ రాజ్యమంటూ శంఖాన్ని పూరించి నాగలితో దుక్కి దున్ని, దుఃఖాన్ని పారదోలాలంటూ, కోపావేశాల తో కొట్లాటలకు తావీయకుండా, గాంధీ శాంతి సందేశంతో జీవించా లంటూ ఎలుగెత్తి చాటినదీ గీతం. ఈ గీతం కూడా బృందగానంగా 'ఆకాశవాణి' లో అనేకసార్లు ప్రసారమైంది. ఇలా కవితాశరథిగా ప్రసిద్ధికెక్కిన దాశరథి గారు అనేక లలిత గీతాలను కూడ రచించి లలిత గీత విస్తారానికి కృషి చేశారు.

**డా. సి నారాయణరెడ్డి (1931 - ):** ఆధునికాంధ్ర సాహిత్యాన్ని మథించి 'డాక్టరేట్' పట్టాను పొందడమే కాకుండా 'నాగార్జున సాగ రం', 'కర్పూరవసంతరాయలు ' ,'విశ్వనాథ నాయకుడు' మొదలు ప్రౌఢ కావ్యాలను గేయంలో రచించి, పద్యానికి గేయమే మాత్రం తీసిపోదని డా. సి. నారాయణరెడ్డి గారు నిరూపించారు. 'అజంతా సుందరి', 'వెన్నెలవాడ', మొదలైన గేయనాటికలను అద్భుతంగా రూపొందించారు. 'నవ్వని నవ్వు' మొదలిడి జ్ఞానపీఠ' పురస్కా రాన్ని సాధించి పెట్టిన 'విశ్వంభర' వరకు అనేక కావ్యాలను వెలువ రించారు. నవ్యగేయ కవిచక్రవర్తిగా గేయం విలువపెంచారు. నారా యణ రెడ్డి గారు తొలినాళ్ళలో రాసిన గేయాల్లో 'ఎల్లోరా గుహలు' శీర్షికన అల్లిన గేయం పేర్కొనదగింది.

శిలలో మృదుజీవ కళలు నింపిన శిల్పి
ఈవె రూపొందినా వెల్లోర గుహలలో
మందహాస తుషార సౌందర్య వర్షాల
ఎటుల కురిపించినా వెల్లోరా గుహలలో
......................................
గాలితాకిడి చేత – కందే కపోలాల
ఎటుల చెక్కితివయ్య ఎల్లోర గుహలలో
నల్ల నల్లని రాతి కళ్ళలో నునుసిగ్గు
నెటుల చిందితివయ్య ఎల్లోర గుహలలో

అని ఖండ గతిలో ఎల్లోర గుహలలో గాలితాకిడికే కందిపోగల కోమ లి చెక్కిళ్ళను, నల్ల రాతి నాతి కళ్లలో కదలు సిగ్గు దొంతరలను మనోహరంగా చెక్కిన శిల్పిని మనసారా కొనియాడారు. శిలలో జీవకళలను పలికించిన శిల్పి ఉలిని ప్రస్తుతించారు. కుల మతాల ను ఎంచే కుమతులను ఆ నాడే విమర్శిస్తూ అల్లిన 'ఓ మనిషి' గేయంలో –

వర్తమాన వలయంలో
చిక్కుపడ్డ ఓ మనిషీ !
భవితవ్యపు సుడిగుండం
బారినుంచి తప్పేవా?
కులమతాల త్రాసులోన

తెలివిని తూచే కుమతీ !

జ్యోతిలాంటి ఉరుమేధల

నీ తరాజు తూచేనా?

అని కులమతాల కుటిలాత్ములను నిలదీసి ప్రశ్నించడమే గాకుండా బండలను భగవంతుడని నమ్మించి మోసగిస్తున్నారంటూ పుజార్లనూ మందలించారు. నిజాం నిరంకుశపాలన నుంచి బయట పడి విశాలాంధ్రలో తెలంగాణా విలీనమయ్యాక ఆనందంతో అల్లిన 'రాష్ట్రావతరణం' గేయంలో

ఆంధ్రరాష్ట్ర మవతరించెనోహో !

అంధయుగం బంతరించె నోహో!

నలువైపుల చీకటి నా

గులు ప్రాకిన, ద్వేష విష

మ్ములు దూకిన, నీల నిశా

నిలయంలో నేటి కుష

స్సులు లేచెనహో! సుమన

స్సులు పూచె నహోహో !

అని అంతులేని ఆనందాన్ని పద్యాల వంటి వింత వింత విరుపుల నడకలతో గేయాన్ని నడిపారు. చీకటి అంతరించి ఆంధ్ర రాష్ట్ర అరుణోదయం అవతరించినట్లు తెలిపారు.

నాగార్జున కొండలలో

రాగధునులు జాలువారె

అమరావతి గుండెలలో

అమర కళలు సేదదీరె ||నా||

అనే శిల్పసంపదలైన నాగార్జునకొండ, అమరావతిని, సాహితీ మూర్తులైన నన్నయాదులను, కృష్ణా-గోదావరి నదులను కొనియాడారు. మందారంలా తెలుగుమాట వికసించినట్లు వర్ణించారు. మందారం పూదేనె మధురమైంది. మిగతా పూలకంటే విరివిగా విచ్చుకునేది. కాబట్టి అటువంటి మందారంతో తెలుగు భాషా వికాసాన్ని పోల్చడం అందంగా, ఔచిత్యం ఉంది. 'వెన్నెల వాడ', 'అజంతా సుందరి','సుగాత్రి' మొదలైన గేయ నాటికల్లో మధురమైన గేయాలు చోటు చేసుకున్నా ప్రస్తుతాంశమైన లలిత గీతాల్ని దృష్టిలో పెట్టుకుని వాటిని స్పృశించడం లేదు. 1955 లో 'నారాయణ రెడ్డి గేయాలు' గా వెలువడిన సంపుటిలో 'ప్రకృతి లోని ప్రణయిని' అనే గేయంలో –

చుక్కలతో నొక్కసారి

సూచింతును నా కన్నియ

నల్లని వాల్జడల సందుల

మల్లియలై మొలవాలని

అని చివరకు ప్రకృతినే తన పడతి మారిపొమ్మని ప్రార్థించడం దీని ప్రత్యేకత.తెల్లని చుక్కలను తన ప్రేయసి జడలో మల్లెలుగా, నల్లని మబ్బులను ముంగురులుగా, శూన్యాకాశాన్ని నెచ్చెలి నెన్నడుముగా, ఎగిసే సురగంగను కొంగుగా మారిపోవాలని భావించడం మనోహరంగా ఉంది. ఈ గేయమే తరువాత 'ఏకవీర ' చిత్రం లో సినీగీతంగానూ రాణించింది .'హేమంత విరహిణి' (పుట: 22–25 ) గేయంలో

నేటి చలి వేళ న –

న్నేల విదిలించితివి

జాణతనమా సఖీ !

ఓ నా పరాఙ్ముఖీ!

..................

అని అలిగిన ప్రేయసిని హేమంతపు చలిలో ఏకాంతం మాని, వెచ్చని తనకౌగిలిలో కరిగి పొమ్మని ప్రాధేయ పడటం చక్కగా రచించారు. 'మిసిమి వలపు' (పుట: 26) అనే మరోగేయంలో

పృథు పయోజ భారము కం

పించిన సహియింతుగాని

పలుచని నడుమల్లాడగ

భరియించగలేను సఖీ!

.............................

భూగోళం లాంటి గుండ్రని భారమైన ప్రేయసి వక్షోజాలు కంపించినా సహించగలను గాని సన్నని నడుము అల్లాడితే భరించ లేనని, పద్మాల్లా పగలంతా విప్పారిన నేత్రాల్ని చూతుగాని, రాత్రి పడక గదిలో కోపంగా వాలుచూపు విరిసితే నిమిషమైనా నిలువలేనని నాయకుడు నాయికతో వాపోవడం , తన మిసిమి వలపుల్ని వెల్లడి చేయడం కొత్తగానే గాక మత్తుగా ఉంది. (ఇంకా వుంది)

## చిక్కులు పడిన దారం

శ్రీ తుమ్మూరి రామ్మోహన్ రావు

జీవితం
చిక్కులు పడిన దారంలా
రోజు రోజుకీ సంక్లిష్టమ
ఒక ముడి విప్పితే మరొకటి తయ్యారు
బాల్యం దారం పేనటానికే సరి పొయ్యింది
యవ్వనం దారం చుట్టటం లోనే కరిగి పొయ్యింది
ఇప్పుడు అవసరానికి దారం విప్పుతుంటే
చిక్కులు పడుతున్నాయి
చూపును తప్పు పడుతున్నాయి
వణికేచేతుల్ని నిందిస్తున్నాయి
అలసి పోతున్న గుండెను నిలదీస్తున్నాయి
ఆపై తెలివిని ప్రశ్నిస్తున్నాయి
ఇప్పుడు
ఏమనుకుని ఏం లాభం !
ఎవరైనా విప్పేవారున్నారేమోనని
ఇటూ అటూ చూస్తే
పేనుతున్నవారో
చుట్టుతున్నవారో
నాలా విప్పాలని అవస్థ పడే వాళ్ళో
ఎవరి చిక్కుల్లో వాళ్లు
ఈ లోగా మునిమాపు
ఆపై చిమ్మచీకటి.

## గోదా కళ్యాణం

శ్రీ దూపాటి శేషుకుమారాచార్యులు.

కం. విల్లిపుత్తురు లో విప్రుడు
అల్లిన మాలికలు తెచ్చి అందముగానున్
మెల్లిగ మాధవు నికేయ
నల్లని కేశము అగుపడె నవనవ లాడుచూ
కం. పంతము బూనిన గోద నా
సొంతమని రంగడు పలికె చిత్రముగానున్
కాంతలు కోరిరి జనకుని
శాంతితో వివాహపు విషయము చెప్పగ మురిసెన్
కం. రంగులు ముగ్గులు దిద్దరే
పొంగిన హృదయము ను కూడి పొంగలి వండరే
అంగరంగ వైభవముతో
రంగని పరిణయము చూడ కదలి రండని నేడూ
కం. జుట్టును నున్నగ దువ్వీరి
కట్టిన మాలిక తురిమిరి కాంతలు సిగలో
బొట్టును పెట్టిరి నుదుటన
పట్టు చీర కట్టే పడతులు పరవశముగా
కం. మంగళ తోరణములన్ని
ముంగిట న కట్టే రమణులు ముచ్చట గొలుపన్
పొంగిన హృదయం తోడను
మం గళ సూ త్రమును కట్టే మది పులకించగా
కం. చిలుకలు రంగనాధునికి
వలపుల రాగమును పాడే వయ్యారి గోదా
తెలిపే మక్కువ ప్రేమను
పలుకులు కావవి సరాగ పాటల ఝూరి

## మంచు కురిసే వేళ

శ్రీమతి సరోజా కృష్ణ

మాఘ మాస మందు
చలి గాలి మసలు చుండ
ఆకాశమార్గము నుండి
ఆకారములు వేర్వేరు కల్గి
చంద్రుని చల్లని తెల్లని
కిరణాలలో తడిచి
వజ్రపు కాంతులతో
వొక్కొక్క మంచు తునక
దక్ష ప్రజాపతి పుత్రికలు
పుడమికి పయనమై
వచుచున్నారా యన్న వైనమున
వొంపు సొంపులు కల్గి
వయ్యరములొలికించుచు
ధరిత్రి నంతయు కప్పి
ధవళ కాంతులతో
ఆకురాలు కాలమునుండి ఆకులు లేక
సిగ్గుపడుచు నగ్నముగ నిలబడిన చెట్ల
శాఖోప శాఖలపై నిల్చి వస్త్రముగ మారె
మెరిసె నా చెట్లు మేలిమి ముత్యములై
పరవశించె హృదయము ఆ ప్రకృతిని జూడ
ఇంతలో ...
మంచు కణ మొక్కటి మృదువుగ
చెక్కిలి తాకగ చేరె నా మనసు
ఎక్కడికో మరెక్కడికో ...

## కథలూ – కబుర్లూ

డా. వై. వి. రమణ, గుంటూరు (ఇండియా)

"నాన్నోయ్! ఆకలి. నూడిల్స్. అర్జంట్." మా అబ్బాయి బుడుగు ఆర్తనాదంతో ...న్యూస్ పేపర్ చదువుతూ, పాకిస్తాన్ రాజకీయాల గూర్చి తీవ్రంగా ఆలోచిస్తున్న నేను ఉలిక్కిపడ్డా. మావాడికి గుండెపోటులాగా 'ఆకలిపోటు' అనే రోగం ఉన్నట్లుంది, హఠాత్తుగా ఆకలి కేకలు వినిపిస్తాడు. నా భార్యకి నైట్ డ్యూటీ. వంటావిడ ఇంకా రాలేదు.'ఖర్మరా బాబు!' అని సణుక్కుంటూ నూడిల్స్-గా పిలవబడుతున్న వానపాముల వంటి పదార్ధ తయారీ కార్యక్రమం మొదలెట్టాను. నాకు రెండే వంటకాలు వచ్చు. ఒకటి నూడిల్స్, రెండు ఆమ్లెట్. దశాబ్దాలుగా అనేక వంటకాలు రుచి చూస్తున్నాను గదా. మరి ఇంతకాలం వంటెందుకు నేర్చుకోలేక పొయ్యానబ్బా! ఆలోచనలో పడ్డా. వెంటనే అనుబంధ ప్రశ్న. అనేకరకాల రచనలు చదుతున్నాను గదా, మరి నేను రచయితని ఎందుకు కాలేకపోయ్యాను? ఇదేదో తీవ్రంగా యోచించవలసియున్నది. కథలు రాయాలంటే, ముందుగా మంచికథలు పుంఖానుపుంఖాలుగా చదివి, ఒక గొప్ప అవగాహనతో మాత్రమే రాయాలని పెద్దలు వాక్కుచ్చారు కదా. మరి వంట బాగా చెయ్యాలంటే అనేక రకములైన రుచులు తెలిసి ఉండాలా? ఏమిటో అంతా గజిబిజి గందరగోళం! మంచి కథకుడు కావాలంటే ముందు ప్రపంచ సాహిత్యాన్ని మధించాలని చెప్పాడు శ్రీశ్రీ. ఆమధించే ప్రోగ్రాంలో మనం ముసిలాళ్ళయిపోవటం మాత్రం ఖాయం. మంచి తెలుగు రాయాలంటే మంచి ఇంగ్లీషు పాండిత్యాన్ని సంపాదించమని కూడా రావిశాస్త్రికి సలహా ఇచ్చాడు! శ్రీశ్రీదేం పొయ్యింది, హాయిగా గుప్పిడి బిగించి గుప్పుగుప్పుమంటూ దమ్ము కొడుతూ ఎన్నయినా సలహాలిస్తాడు. ఆ తరవాత చదవలేక చచ్చేది మనమే కదా! ఒకవేళ చచ్చీచెడీ చదివినా, 'చదవేస్తే ఉన్న మతి కాస్తా పోయిందట' అన్న సామెత నిజం కాదనే గ్యారంటీ లేదుగదా! మంచి పాఠకుడు మంచి కథకుడు అవటం కష్టం. అలాగే మంచి కథకుడు మంచి పాఠకుడు అయిన ఋజువు కూడా లేదు. 'ఏమిటి మాకీ శిక్ష? ఏదో సరదాగా నాలుగు ముక్కలు చదివి పోదామని వస్తే ... రాజకీయనాయకుడి ప్రసంగంలో మాటల్లా అర్థం కాకుండా, అర్థంపర్థం లేకుండా ఈ పిచ్చి మాటలేంటి?' అంటున్నారా? చిత్తం. నాక్కూడా అలాగే ఉందిలేండి. నా మేధావిత్వాన్ని కొంచెం తగ్గించుకుని, మీకు సామాన్యులభాషలో చెప్పటానికి ప్రయత్నిస్తాను.అందుకొరకు మీకో సింపుల్ ఈక్వేషన్ ఇస్తున్నాను.

వంట = కథ.

మంచి వంట = మంచి కథ.

చెత్త వంట = దరిద్రపుగొట్టు కథ.

వంటవాడు = రచయిత.

భోంచేయువాడు = పాఠకుడు.

తిండి పుష్టి గలవాడు = విపరీతంగా చదివే అలవాటు గలవాడు.

తిండిపోతు = ఏదిబడితే అది చదివి బుర్ర పాడుచేసుకునే అజ్ఞాని.

ప్రస్తుతానికి కథలు, రచనలు పక్కనబెట్టి వంట గూర్చి మాట్లాడుకుందాం. మీకు వంటంటే ఇంటరెస్ట్ ఉందా? వంట చెయ్యటం మొదలెడాదామని అనుకుంటున్నారా? అయినచో మినిమం కొన్ని రుచులు తెలుసుండాలి. ఉదాహరణకి గుత్తివంకాయ కూర (ఇది నాకు అత్యంత ఇష్టమైన కూర కావున, ఇవ్వాల్టికి ఇదే ఉదాహరణ). అసలు గుత్తొంకాయ కూర రుచి తెలీకుండా గుత్తొంకాయ ఎలా చేస్తారు? చెయ్యలేరు. కాబట్టి ఆ గుత్తొంకాయని కనీసం గానయినా తిని ఉండాలి. తిన్నారు గదా. రుచి తెలుసుకున్నారు గదా. ఇహనేం! ఆలశ్యం చెయ్యకుండా వెంటనే గుత్తొంకాయ వంట ఉపక్రమించండి. ఇప్పుడు మీక్కావలసిన నవనవలాడే పొట్టి వంకాయలు, సెనగ పొడీ, పచ్చి మిర్చి, ఉప్పూకారం వగైరా సమకూర్చుకోండి. ముందుగా వంకాయలకి నిలువుగా నిక్ ఇచ్చి, సెనగ పొడి కూరండి. స్టవ్ వెలిగించండి. బాండీలో నూనె వేసి బాగా మరిగించండి. ఇప్పుడు వంకాయల్ని నూనెలో వేసి దోరగా వేయించండి. తరవాత ఉప్పూకారం చల్లండి. అంతే! గుత్తొంకాయకూర రెడీ! ఇప్పుడు కూరని పొయ్యి మీద నుండి దించండి. కొత్తిమీర, కరివేపాకు వెయ్యండి. రుచి చూడండి. రుచిగా లేదా? ఆయుర్వేద మందులా ఉందా? డోంట్ వర్రీ! అధైర్య పడకండి. గొప్పగొప్పోళ్ళ వంట మొదట్లో ఇలాగే తగలడుతుంది! వండగానే పండగ కాదు. ఇప్పుడు మీరు మీ వంకాయల్ని రుచి చూడమని చుట్టపక్కాలనీ,

ఇరుగమ్మ పొరుగమ్మల్నీ, దారినపోయే దానయ్యల్నీ.. ఇలా కనిపించిన వారందర్నీ రిక్వెస్ట్ చెయ్యండి. అవసరమైతే బ్రతిమాలండి, వీలయితే బలవంతం చెయ్యండి, కుదిరితే బెదిరించండి. తప్పు లేదు. మీ హింస భరించలేక చచ్చినట్లు అందరూ మీకు ఫీడ్ బ్యాక్ ఇస్తారు. 'గుత్తొంకాయ రుచి కుదిరింది గానీ.. కొంచెం గట్టిగా ఉంటే ఇంకా బాగుండేది.' అనే మొహమాటపు మర్యాద కామెంట్లనీ, 'నీబొంద. ఈ ఫెవికాల్ పేస్టుని గుత్తొంకాయ అనికూడా ఈమధ్య అంటున్నారా?' అనే శాపనార్థాల కామెంట్లని చిరునవ్వుతో స్వీకరించండి. తప్పులు, పొరబాట్లు నోట్ చేసుకోండి. ఈసారి వండినప్పుడు మాత్రం గుత్తొంకాయ కూర ఇంతకు ముందుకన్నా బెటర్ గా ఉండాలని గుర్తుంచుకోండి. ఇట్లా వచ్చీరాని వంట మొదలెట్టడం వల్ల మనకో గొప్ప మేలు చేకూరుతుంది. ఈరోజు నుండి మీపేరు కూడా వంటవాళ్ళ లిస్టులో నమోదయిపోతుంది. కావున మీ దృష్టికోణం మారుతుంది. నిన్నటిదాకా ఇతరుల వంట తిని ఎంజాయ్ చేశారు. ఇప్పుడు మీ ఆలోచన 'ఈ వంకాయకూర నా కూర కన్నా బాగుంది. ఈ వంటవాడి కిటుకు ఏమై ఉంటుందబ్బా!' అంటూ సాటి వంటవాళ్ళ ఫార్ములా గూర్చి సీరియస్ గా ఆలోచించటం మొదలెడతారు. ఈ జిజ్ఞాసే భవిష్యత్తులో మిమ్మల్ని మంచి వంటగాడిగా నిలబెడుతుందని గుర్తుంచుకోండి. సో - మీ ప్రయాణం గుత్తొంకాయతో మొదలై.. పులిహోర, ఉప్మాపెసరట్టు మీదుగా పెరుగావడలు దాటుకుంటూ 'ఎక్కడికో వెళ్ళిపోతుంది.' మీ విజయానికి కారణం? ఒక సాధారణ వంటకంతో మొదలెట్టి, ఏకాగ్రతగా దాన్నే ఇంప్రోవైజ్ చేస్తూ, తప్పులు రిపీట్ చెయ్యకుండా, అందరి వంటకాలని రుచి చూస్తూ, తద్వారా మీ వంటకాన్ని మెరుగు పరుచుకోవటం. ఇది చాలా సింపుల్ ప్రిన్సిపుల్! ఈ పద్ధతే ఫాలో అవుతూ ఇంకొన్ని వంటకాలు నేర్చుకోవటం ఇప్పుడు సులభం. ఇక్కడో ముఖ్యమైన పాయింట్ - బేసిక్స్ తెలుసుకుని త్వరగా మీ వంట మీరు ప్రారంభించాలి. బెస్ట్ ఆఫ్ లక్. ఇంకో సలహా. కొన్ని దుష్టగ్రహాలకి దూరంగా ఉండండి. ఈ గ్రహాలు మంచి రుచులు తెలిసిన తిండిపుష్టి గలవారు. మీచేత అనేకరకాల వంటకాలు తినిపిస్తారు. హైదరాబాద్ బిరియాని, మొఘలాయ్, తందూరి, చెట్టినాడ్, చైనీస్.. ఇట్లా అనేకరకాల, అత్యంత రుచికరమైన వంటలని, ది బెస్ట్ రెస్టారెంట్లలో తినిపిస్తారు. ది బెస్ట్ చెఫ్ లని పరిచయం చేస్తారు. ఆ వంటకాల గూర్చీ, ఆ వంటోళ్ళ గూర్చి మీకు కథలు కథలుగా చెబుతారు. వంట చెయ్యటం ఎంత పవిత్ర కార్యమో, ఎంత నైపుణ్యం కావాలో మీకు రామాయణ భారతాలుగా వర్ణిస్తారు. తత్ఫలితంగా మీకు వంట పట్ల అపార భక్తిప్రవృత్తులు కలుగుతాయి. అందువల్ల మీరు కనీసం వంటిల్లు వైపు కన్నెత్తి చూడాలన్నా వణికిపోతారు. ఒకవేళ వెళ్ళినా, గ్యాస్ స్టవ్ వెలిగించటానికి కూడా భయం. ఇంకా మొండిగా గుత్తొంకాయకూర వండుదామని ఉపక్రమించినా ... అప్పటికే మీమీద బలంగా పనిచేస్తున్న స్వదేశీ, విదేశీ వంటల ప్రభావం వల్ల మీ గుత్తొంకాయకూర కాస్తా.. ఏ 'వంకాయ తందూరి గుత్తి చౌచౌ కూర' గానో రూపాంతరం చెందుతుంది. దుష్టగ్రహ సావాసం మూలంగా మీకు రుచులు తెలుసు కాబట్టి, మీకూరకి మీరే సున్నా మార్కులు వేసేసుకుని, ఇంకెప్పుడూ వంట చెయ్యరాదని తీర్మానించేసుకుంటారు. ఇందుమూలంగా ఈ సమాజం ఒక వంటవాడిని కోల్పోతుంది. అదన్నమాట ... సో తస్మాత్ జాగ్రత్త !

ఇప్పుడు మనం ఈ వంటల చర్చని తెలుగు కథలు, రచయితల మీదకి మళ్ళిద్దాం. నాకు హైస్కూల్ రోజుల నుండి తెలుగు పత్రికలు చదివే అలవాటుంది. థాంక్స్ టు చందమామ, ఆంధ్రపత్రిక అండ్ ఆంధ్రప్రభ. ఈఅనుభవంతో చిన్నప్పుడు స్నేహితులతో కలిసి ఒక వ్రాతపత్రిక నడిపాను. వెల ఐదు పైసలు. మా ఫణి తండ్రి వారణాసి సుబ్రహ్మణ్యంగారు ఇండియన్ ఎక్స్ ప్రెస్ రిపోర్టర్. ఆయన టైపు మిషన్లో వాడి పడేసిన కార్బన్ పేపర్లని డస్ట్ బిన్-లోంచి సేకరించి, చేతులు నొప్పెట్టాలా(వెలిసిపోయిన కార్బన్లు కావున పెన్సిల్ని ఒత్తిపట్టి రాయాల్సొచ్చేది) తావుల నిండా కథలు రాసి, ఆ కాపీలని ఇళ్ళల్లో పెద్దలకి అమ్మేవాళ్ళం (అంటగట్టే వాళ్ళం). మా రచనా బాధితులు మమ్మల్ని 'ఒరే! ఇంత చిన్న వయసులోనే ఇంత జబ్బపుష్టితో కథలు రాస్తున్నారు. పెద్దయ్యాక చాలా గొప్పకథలు రాస్తారు.' అని దీవించేవాళ్ళు. ఐదు పైసల పత్రికపై వచ్చిన లాభాలతో పుల్ల ఐస్ కొనుక్కునేవాళ్ళం. ఆవిధంగా చిన్నతనంలోనే వంట ప్రారంభించాను, లాభాలు గడించాను! పెద్దయ్యాక - గుంటూరు మెడికల్ కాలేజీ మ్యాగజైన్ కోసం 'ప్రేమ పిచ్చిది ... గుడ్డిది ... కుంటిది ...'అని ఒక కథ వ్రాశాను. అయితే అప్పటికే తెలుగు కథ మీద నాకు గౌరవం

***Roopa Nampally - Coldwell Banker Broker Sales Associate***

**50 Princeton Hightstown Road**
**Princeton Junction 732-397-9185 (Cell)**
**Website: www.roopanampally.net**
**E-Mail: nroopa@comcast.net**

**Member of (Radha Cheerath Team).**



Buying or selling a home is one of the most important decisions you make in your life. Equally important is the right Real Estate Agent for that job.

You need a Real estate agent, like me, who has gone through formal training on an on-going basis and who will guide you through the many steps and decisions you make in the process of buying or selling a home.

Commitment to my job, superior negotiating skills, knowledge, easy accessibility, honesty, and hard work are very important to this job and those are my foremost qualities.

I will do my best to make your real estate experience as easy and as stress-free as possible.

# *Internal Medicine Group*

**Board Certified**

Dr. Arvind Doshi M.D.
Dr. Priti Mehta M.D.
Dr. Sujatha Muppala M.D.

Health is the only everlasting wealth. An ounce of Prevention is worth a pound of cure

- High Blood Pressure, Diabetes and High cholesterol are "Silent Killers" and tight control will prevent heart attacks and stroke
- Hospital affiliations with St. Peter Hospital, JFK Medical Center and Princeton Hospital
- Learn the Secrets of Nutrition to achieve desired Weight Loss
- Learn about all the Cardiovascular risk factors responsible for clogging the arteries

**Office Hours:**

Monday – Friday : 9.00 AM to 5.00 PM
Saturday : 9.00 AM to 2.00 PM

5 Stanworth Road
Kendall Park, NJ 08824
Phone: (732) 297-2343

906 Oak Tree Road, Suite K
South Plainfield, NJ 07080
Phone: (908) 822-2277

పెరిగిపోయి, 'నేను ఏ కథా రాయక పోవటమే తెలుగు సాహిత్యానికి నేను చెయ్యగలసేవ' అనే నిర్ణయానికి వచ్చేశాను. కానీ, మ్యాగజైన్ కోసం కథ రాయక తప్పలేదు. ఈ కథాకమామిషు తరవాత రాస్తాను. రాజును చూసిన కళ్ళతో మొగుణ్ణి చూడలేం గనుక, నా కథ నాకు మొగుళ్ళా కనిపిస్తుందని ముందే తెలుసు గనుక, అచ్చులో పడ్డ నాకథని నేనింతవరకూ చదవలేదు. అసలు పట్టించుకోలేదు. కారణం, 'కథలని చదువుటలో ఉన్న హాయి, రాయుటలో లేదని, నిన్ననే నాకు తెలిసింది ...' అని బుద్ధిమంతుడులో నాగేశ్వర్రావులా పాడుకుంటున్న కారణాన! మరి నాకళ్ళకి కనిపించిన రాజు ఎవరు? ఏమీ తెలీని రోజుల్లోనే కట్టల కొద్దీ కాగితాలు ఖరాబు చేసిన నన్ను, కాగితం మీద కలం పెట్టటానికి కూడా చలిజ్వరం వచ్చినవాళ్ళా వణికిపోయేట్లు చేసిన ఆ పెద్ద మనిషి ఎవరు? ఇంకెవరు! రాచకొండ విశ్వనాథశాస్త్రి! కాబోయే గొప్పవంటవాడిని కేవలం రుచులని ఆస్వాదించువాడిగా మార్చేశాడు! ఈ రావిశాస్త్రి అత్యంత నిర్దయుడు, స్వార్థపరుడు. తెలుగు కథలని వెయ్యికిలోమీటర్ల ఎత్తుకి తీసికెళ్ళి, వేరెవ్వరూ తన దరిదాపులకి కూడా రాకుండా, చుట్టూతా పెద్ద కంచెని వేసేసుకున్నాడు. నావంటి అర్భకులు ఆ ఎత్తు, ఆ కంచె చూసి జడుసుకున్నారు! మెడిసిన్ చదివేవాళ్ళకి సాహిత్యాభిలాష ఒక లక్జరి. ఎంట్రెన్స్లో చచ్చీచెడీ సీటు సంపాదించాం కనుక కొంచెం రిలాక్స్ అవుదాం అనుకునేలోపుగానే, ఎనాటమి అనే ఒక దుష్టదుర్మార్గ పరీక్ష వచ్చేస్తుంది. అటు తరవాత పెథాలజీ అనే ఒక రాక్షసి వస్తుంది. ఇట్లా రక్కసుల సంతతి మనమీద విడతలుగా దాడిచేసి, మనలో గుజ్జు లాగేసి టెంకని మిగులుస్తాయి. చాలాసార్లు 'ఎవరి కోసం? ఎవరి కోసం? ఈ పాపిష్టి బ్రతుకు! ఈ నికృష్ట జీవితం ...' అని పాడుకోవలసి వచ్చేది. ప్రేమనగర్ సినిమాలో నాగేశ్వర్రావు పాడంగానే వాణిశ్రీ వచ్చింది. నాకు మాత్రం పిశాచ పరీక్షలొచ్చేవి! ఈ పీడన, ఈ బాదరాయణం లేని నా ఆర్ట్స్ సబ్జెక్టుల స్నేహితులు తీవ్రమైన రాజకీయ సాహిత్య చర్చలు చేస్తుండేవాళ్ళు. వాళ్ళమధ్య 'మౌనమే నీ మూగభాష ...' అంటూ పాడుకోవటం నాకు ఇబ్బందిగా ఉండేది. వాళ్ళు పొద్దస్తమానం ఒకపేరు ప్రస్తావించే వాళ్ళు. ఆపేరు రావిశాస్త్రి. అసలు ఈ శాస్త్రి సంగతేంటో తేల్చాలని నిర్ణయించుకున్నాను. నారు పోసేవాడే నీరు పొయ్యాలి. అంచేత వాళ్ళదగ్గరే రావిశాస్త్రి 'బాకీ కథలు' బాకీగా తీసుకున్నాను. 'ఎవడు వీడు? ఎచటివాడు? ఇటు వచ్చిన శాస్త్రివాడు.' అనుకుంటూ రావిశాస్త్రి పుస్తకం తెరిచాను. ఒక కథ చదవంగాన్లే దిమ్మ తిరిగి మైండ్ బ్లాంక్ అయిపోయింది. కథ అంటే ఇలా కూడా ఉంటుందా! తెలుగు ఇలాకూడా రాస్తారా! కొన్నిసంవత్సరాలుగా రుచీపచీ లేని మజ్జిగన్నం తినేవాడికి.. హఠాత్తుగా పులిహోర, గారెలు, దోసావకాయతో భోజనం రుచి తగిలితే ఎలా ఉంటుంది? అప్పుడు నాకలా అనిపించింది. అన్ని కథలు చకచకా చదివిన తరవాత పుస్తకం మూసి ఆలోచనలో పడ్డాను. అప్పటిదాకా తెలుగులో నే చదివింది అరటి, ఆవు కథలని అర్థమైంది. ఈ రావిశాస్త్రి విస్కీ తాగుతాడు. మనకి తన 'రచనలు' అన్న విస్కీ పోస్తాడు. ఆల్కహాల్ ఎడిక్షన్ లాగానే రావిశాస్త్రి రచనలు కూడా ఒక ఎడిక్షనే! ఆల్కహాల్ని మానిపించటానికి సైకియాట్రిస్టులు ఉన్నారు. ఈ రావిశాస్త్రి ఎడిక్షన్ కి డీ-ఎడిక్షన్ ఫెసిలిటీ లేదు!

తిరపతి లడ్డు తిన్నవాడికి ఇంకే లడ్డూ రుచిగా ఉండదు. బెజవాడ బాబాయ్ హోటల్లో ఇడ్లీ తిన్న తరవాత ఇంకెక్కడా ఇడ్లీ నచ్చదు. ఈ రుచులు ఎంత కమ్మగా ఉంటాయంటే, మనం వండటానికి ప్రయత్నం చెయ్యాలన్నాకూడా భయమేస్తుంది. వెరీ డిస్కరేజింగ్ (నిరుత్సాహం), కొండకచో ఇంటిమడేటింగ్ (భీతి). ఈ అల్టిమేట్ రుచులు టేస్ట్ చెయ్యనివాడు అదృష్టవంతుడు. 'తావలచింది రంభ! తామునిగింది గంగ!' అనుకుంటూ ఏదోకటి వండుతూనే ఉంటాడు. అలా వండగా వండగా వాడే ఓ గొప్ప వంటోడు అవ్వచ్చేమో! తినగ తినగ వేము తియ్యగానుండు! ఏదో ఒకటి, కథలు రాసీరాసీ వాడే గొప్పరచయిత అవ్వొచ్చుగదా! కాబట్టి-కథలు రాయడం మొదలెడదామనుకునే మిత్రోత్తములారా! అనుభవంతో చెబుతున్నాను. మీరు రావిశాస్త్రిని, కుటుంబరావుని చదవకపోవటమే మంచిది. వీళ్ళు చాలా డేంజరస్ రచయితలు. అట్లని అసలు చదవకుండా ఉండొద్దు. ఏదో స్వాతి, జ్యోతిల్లాంటి సాధారణ పత్రికలు ఫాలో అవ్వండి. సరిపోదనుకుంటే యండమూరి, మల్లాదిలాంటి వాళ్ళు విచ్చలవిడిగా రాసిపడేసిన పల్ప్ ఫిక్షన్లు కొన్ని చదవండి. చాలు. అసలేం చదవకపోయినా కొన్ని ప్రమాదాలు సంభవించవచ్చు. ఫిజిక్స్ అస్సలు తెలుసుకోకుండా ప్రయోగాలు చేస్తే.. న్యూటన్ సూత్రాలు, ఆర్కిమెడిస్

WE COULDN'T BE MORE EXCITED ABOUT THIS MESSAGE

# Yes, WE ARE GROWING

# Yes, WE ARE HIRING

Even in this economy

To Find Out How You Can Bring Your Career to LIFE Contact me Today



**Thevan Theivakumar**, CLF®

Sr. PARTNER, New Jersey Sales Office

**(732) 744-3763**

ntheivakuma@ft.newyorklife.com

www.ThevanTheivakumar.com

EOE.M/F/D/V

WE STAND STRONG

JOIN OUR TEAM

NEW YORK LIFE

The Company You Keep®

New York Life Insurance Company 399 Thornall Street, 7th Floor Edison, NJ 08837

సిద్ధాంతాల్నే మళ్ళీ కనిపెట్టే డేంజరపాయం ఉంది! అటులనే సాహిత్యంలో నిరక్షరాశ్యులమైతే, కన్యాశుల్కాన్ని (ఆల్రెడీ గురజాడ రాశాడని తెలీక) మళ్ళీ రాసే ప్రమాదం ఉంది, జాగ్రత్త!

"నాన్నోయ్! ఎంతసేపు? నాకు ఆకలేస్తుంది." బుడుగు గావుకేక. "బుడుగమ్మా! వచ్చేవచ్చె, ఇదిగో నీ నూడిల్స్." అంటూ నూడిల్స్ సర్వ్ చేశాను. ఉఫ్! అలవాటు లేని పని. పూర్తిగా అలసిపోయాను. మీకో రహస్యం చెబుతున్నాను, ప్రపంచంలో అన్నిపనుల్లోకల్లా కష్టమైనది నూడిల్స్ వంటకం! ఇప్పుడు నాకో మంచి కాఫీ తాగాలనిపిస్తుంది. ఖర్మఖర్మ! ఈ వంటావిడ ఇంకా రాలేదు. అవున్లేండి, వంట నేర్చుకోవాల్సిన రోజుల్లో కడుపు నిండా తినడం మించి ఏమీ చెయ్యలేదు. హాయిగా తిని పడుకోవాల్సిన రోజుల్లో వండుతున్నాను, ఆ మాత్రం కష్టంగా ఉండదూ మరి!

## పరిష్కారం

మంధా భానుమతి

తలుపు చప్పుడువిని కళ్ళు నులుముకుంటూ లేచి తలుపు తీసింది వసంత. మధ్యాహ్నం రెండయింది. కాలింగ్ బెల్ స్విచ్ ఆఫ్ చేసింది, కాసేపు పడుకుందామని. “హాయ్! అమ్మమ్మా” అంటూ లోపలికి వచ్చాడు వినయ్. “తాతయ్య పడుకున్నారా” అంటూ గదిలోకి వెళ్ళి కంప్యూటర్ ఆన్ చేసాడు. వినయ్ హాస్టల్లో ఉండి ఇంటర్ చదువుతున్నాడు. డిల్లీలో ఉన్న కూతుర్ని, అల్లుడ్ని అడిగింది వసంత, మా ఇంట్లోనే ఉంచచ్చు కదా అని. “మీకెందుకు లేనిపోని టెన్షన్” అన్నారు ఇద్దరూ. వినయ్ ఎప్పుడైనా, పరీక్షలు లేకపోతే వస్తుంటాడు.”అన్నం పెట్టమన్నవా?” లంచ్ అయ్యాక బయల్దేరాను అమ్మమ్మా! వద్దు కంప్యూటర్ కేసి తిరిగి అన్నాడు వినయ్. పళ్ళెం నిండా కారప్పూస తెచ్చి వాడి ముందు పెట్టి తమ గదిలోకి వెళ్ళింది వసంత. నిద్రని మళ్ళీ ఆహ్వానించడానికి. అదేమైనా స్నేహితురాలా పిలవగానే రావడానికి! కళ్ళు గట్టిగా మూసుకుంది. వసంత, సుబ్బారావులిద్దరూ ప్రభుత్వోద్యోగం చేసి రిటైరయ్యారు అయిదేళ్ళక్రితం. పిల్లలిద్దరూ దూరానఉన్నారు. అబ్బాయి అమెరికాలో,అమ్మాయి ఢిల్లీలో. రిటైర్ అయినప్పటినుంచీ విశ్రాంతి కరువైనట్లనిపించింది వసంతకి. అలా అని పెద్దగా చేసిన పనీ కనిపించదు.తీరికా వుండదు. పొద్దున్న లేచి వీధి తలుపు తియ్యడానికే పాతిక సార్లు తిరగాలి. పోనీ తలుపు తీసి పెడదామా అంటే....”ఒంటరిగా ఉన్న రిటైరయిన దంపతుల హత్య....రెండు లక్షల చోరీ” అంటూ పేపర్లో వార్త హృదయ విదారకంగా వినిపిస్తాడు సుబ్బారావు. నేపథ్య సంగీతం ఒక్కటే తక్కువ. తన వయసు

**With Best Compliments from:**

Cosmic
Stone & Tile Distributors

**502 (formerly 475) Jersey Avenue, New Brunswick, NJ 08901**
**Tel: (732) 937 5400 Fax: (732) 937 6969** www.cosmicstone.com

***Wholesale distributors of:***

***Slabs & Tiles:***
Granite, Marble, Onyx
Glass & Jade
Limestone, Travertine & Quartzite
Silestone

***Tiles:***
Polished Porcelain & Glazed Porcelain
Ceramic & Concrete
Limestone & Travertine
Engineered Stone

***New Jersey's Sole Distributor for:***
SILESTONE by COSENTINO

*Also available are beautiful mosaics, chair rails, bullnose and medallions!*

వాళ్ళు చాలామందికి లాగా బీ.పీ..షుగరు లాంటి చుట్టాలు రాలేదు తనకి. కానీ నిద్ర పట్టే సమయానికి ఏదైనా శబ్దం అయిందో ... ఇంక అంతే సంగతులు. అదేం శాపమో కానీ పగలూ, రాత్రీ కూడా సరిగ్గా కళ్ళు మూతలు పడుతున్నప్పుడే ఫోన్ మోగడమో, కాలింగ్ బెల్లో, ఏదీ లేకపోతే ఎపార్ట్-మెంట్ పార్కింగ్-లాట్ లో రివర్స్ గేర్ హారన్ లో ఒకటేమిటి ... నగరంలో శబ్దాలకేం లోటు? ఉద్యోగం చేసేటప్పుడే నయం. ప్రతీదీ టైం ప్రకారం నడిచి పోయేది. అలసిన శరీరం, మనసూ మంచం ఎక్కగానే విశ్రాంతి తీసుకునేవి. అప్పడు ఉరుకులు పరుగులు పెట్టలేక ఎప్పుడెప్పుడు రిటైరవు తానా, మన ఇష్టం వచ్చినట్లుగా పనులు ఎప్పుడు చేసుకో గలుగుతానా అనుకునేది. కానీ అనుకున్నట్లుగా ఏ రోజు లేదు. ఇంట్లో ఇద్దరే తీరిగ్గా ఉంటే ప్రతీదీ భూతద్దంలోంచి కనిపిస్తుంది. పది రోజులు పిల్లలు ఫోన్ చెయ్యకపోతే "ఈ పిల్లలకి మనం అంటే లక్ష్యం లేదు. వారానికొకసారి మాట్లాడ్డానికి క్కూడా కష్టమేనా?" అని పిస్తుంది. అమెరికాలో ఉన్న అబ్బాయి అయితే మరీ అపురూపం. వాళ్లకి అసలు ఊపిరి తియ్యడానికి కూడా టైం ఉండదట. ఆకాడికి అంత దూరం ఎందుకో వెళ్లడం? ఇండియాలో కడుపునిండా గాలి పీల్చుకోవచ్చు కదా! ఆ పక్కనించి ఈ పక్కకి తిరిగి కాళ్ళు ముడు చుకుంది. ఊహూ! లాభం లేదు. చెవులు బద్దలయ్యేలా పాటలు ఎక్కడనుంచో. "టీ పెట్టుకుందామా?" సుబ్బారావు లేచి హాల్లోకి వెళ్తూ అన్నాడు. "ఇదో లౌక్యం. పెడతావా? అనకూడదూ" మనసులోనే విసుక్కుంటూ లేచింది. తలంతా దిమ్ముగా అనిపించింది. అలాగే లేచి టీ నీళ్ళు పొయ్యిమీద పెట్టి వచ్చింది వసంత. హాయ్ తాతయ్యా! వినయ్ వచ్చి తాతయ్య దగ్గర కూర్చున్నాడు. వసంత టీ తీసుకొచ్చి ఇద్దరికీ చెరో కప్పు ఇచ్చి తనొకటి తీసుకుని కూర్చుంది. "పలుకే బంగారం" అన్నట్లు ఉంటాడు వాడు. అడిగిందానికి సమాధానం చెప్తాడంతే. "ఏంట్రా విశేషాలు?" ఉండబట్టలేక అడిగింది. "ఏం లేవు అమ్మమ్మా" ఏం లేవా? రైల్వే బడ్జట్ చూసావా! ఫస్ట్ క్లాసు, సెకండ్ ఏసి తగ్గిస్తారట. మేం ఎప్పుడూ ప్రయాణం చేసే థర్డ్ ఏ.సి. అంతే వుంది. "తా దూర సందు లేదు మెడకో డోల"ని బీదవాళ్ళకి ఏసీ బోగీలట. నాలుగు ఏ.సీ. బోగీలకు బదులు ఎనిమిది మామూలివి వేస్తే వాళ్ళని బస్తాల్లో కూరినట్లు కూరక్కర్లేదు కదా! నువ్వెప్పుడైనా డిల్లీ స్టేషన్ లో బీహార్ వెళ్ళే రైలు చూసావా?' అలా సాగిపోతున్న సుబ్బారావు ఉపన్యాసంనించి తప్పించుకోడానికి టీ కప్పులు తీసుకుని వంటింట్లోకి వెళ్ళింది వసంత. పొద్దున్నించీ రకరకాల సామెతలతో, వేర్వేరు ఉదాహరణలతో విశేషాలన్నీ వినడం అయిం ది. ఇంక ఓపిక లేదు. వినయ్ ని చూసింది. తల ఊపుతున్నాడు. కానీ వినడం లేదని వసంత అనుమానం. సుబ్బారావు చెప్తూనే వున్నాడు. వినయ్ గట్టిగా యం. టి. వీ. పెట్టి కాళ్ళతో స్టెప్స్ వేస్తు న్నాడు. మధ్య మధ్యలో తాతయ్య కేసి తిరిగి తల నిలువుగా అడ్డంగా, గుండ్రంగా ఊపుతున్నాడు. సుబ్బారావు ఆయాసం తీర్చుకోడానికి కాసేపు ఆగాడు. ఇదే సందని వసంత వచ్చి వినయ్ పక్కన కూర్చుని అడిగింది. 'హాస్టల్లో భోజనం అదీ బాగుం టుందా? క్లాసులో పాఠాలు బాగా చెప్తున్నారా? అర్థం అవుతు న్నాయా?' వినయ్ హాస్టల్లో చేరి నెలయింది. ఏం కష్టపడి పోతున్నాడో అని తన భయం. 'బావుంది అమ్మమ్మా! లెసన్స్ ఓ.కె.' టి,వీ. ఛానెల్ మారుస్తూ అన్నాడు వినయ్. 'వ్వాట్. హాస్టల్ మెస్-లో భోజనం బాగుండడమా! మేం హాస్టల్లో ఉండి చదువు కునేటప్పుడు పొద్దున్నే పూరీ, బంగాళదుంపల కూర, మధ్యాన్నం బంగాళ దుంప ముద్ద కూర, ముదురు కూరగాయల సాంబారు, రాత్రి బంగాళదుంపల వేపుడు, పేరు తెలీని పచ్చడి, నీళ్ళలో రంగేసిన చారు, మూడు వందల అరవై నాలుగు రోజులూ అదే మెనూ. నేను మెస్ సెక్రటరీగా ఉన్నప్పుడు, వంటవాళ్లతో కూడా వెళ్ళి లేత కూరగాయలు తెచ్చే వాణ్ననుకో'. 'మెస్ సెక్రటరీగా ఎన్నాళ్లున్నావేంటి తాతయ్యా?' వినట్లేదనుకుంది వసంత. మనవ డు. ఘటికుడే. అష్టావధానం చేస్తాడన్నమాట. "ఎన్నాళ్లంటే ..." నీళ్ళు నములుతున్న సుబ్బారావుకి అందించింది వసంత. "మూడు నెల్లని చెప్పారుగా". చూసావా! అన్నట్లుగా కళ్ళెగరేసి డి.వి.డీ కాబినెట్ తీసి కొత్త డిస్క్ లేమైనా ఉన్నాయేమో అని చూడ సాగాడు వినయ్. "కొత్తవి హారీపాటర్ సీరీస్ వచ్చాయి, తీసుకో లేదా" అంటూ "హారీపాటర్–సోసరర్స్ స్టోన్" ఇరవయ్యోసారి చూడ్డా నికి డి.వి.డి ప్లేయర్ లో పెట్టాడు. మేం అవేవి కొనం కదరా! "ఇప్పైనా మీ అమ్మ తెచ్చిపడేస్తుంది" వసంత అంది. ఎప్పుడో వస్తా డు, వచ్చినప్పుడు ఓ మాటామంతీ లేకుండా కంప్యూటరో, టి.వి.నో, డి.వి.డినో మనసులో విసుక్కుంటూనే మనవడి పక్కన

కూర్చుంది. వాడి ముద్దు మొహం చూస్తూ. కాసేపు ముగ్గురూ సినిమా చూసారు. ఇక సుబ్బారావు వల్ల కాలేదు.

"ఇప్పుడేవిటో ఇవన్నీ ప్రపంచాన్ని ఉర్రూతలూగిస్తున్నాయి. కానీ, ఎప్పుడో మా విఠలాచార్య ఇవన్నీ తీసేసాడు. మాంత్రికుడి మాయలు, గుర్రాలు డాన్స్ చెయ్యడం, మనుషులు పక్షుల్లా మారడం...అసలు ఆ సినిమాలే సినిమాలనుకో...ఇంకా ఈ టెక్నాలజీ అదీ లేకుండానే, ఎంత బాగా తీసేవాడో...అసలు అవన్నీ డి.వి.డీలు చేసి అమ్ము ... హాట్ కేకుల్లా పోతాయి. గురువుని మించిన శిష్యుడు, గండికోట రహస్యం ... సుబ్బారావు చేతులు తిప్పుతూ మొదలు పెట్టాడు. రిమోట్ తీసుకుని వినయ్ వాల్యూం పెంచాడు. వసంత వంటింట్లోకి వెళ్ళిపోయింది ఈ గోల భరించలేక. "టిఫెన్ ఏం చెయ్యమంటావురా వినయ్" టి.వి. కంటే పెద్ద గొంతు చేసి అరవడంతో వసంత గొంతు జీరపోయింది. "బాగా జీడిపప్పు వేసి, అల్లం పచ్చిమిరపకాయలు, కరివేపాకు దట్టించి వెన్నలా ఉప్మా చెయ్యవోయ్. అసలు ఉప్మా రుచి దేనికొస్తుంది? ఆబిడ్స్ తాజ్ మహల్లో ఇదివరకు ఉప్మా ఉండేది" సుబ్బారావు నోరూరిపోయేలా వర్ణిస్తుంటే, వినయ్ టి.వీ కట్టేసి మళ్ళీ కంప్యూటర్ దగ్గరికి వెళ్ళిపోయాడు. కాలింగ్ బెల్ మోత విని టైం చూసింది వసంత, నాలుగు. సరిగ్గా నాలుగింటికి ఎదురింటి రామారావు, పై అపార్ట్ మెంట్ లోని వెంకట్రావు గారు వస్తారు. ముగ్గురూ కాఫీ తాగి కాసేపు విహారానికి వెళ్తారు. ఇంకొంచెం ఎక్కువ నూక వేసి ఉప్మా చెయ్యడానికి మరి కాస్తంత నూనె, పోపు వేసింది. హాల్లో నుంచి గట్టిగా మాటలు వినిపిస్తున్నాయి. సుబ్బారావు  కంఠం మరింత పెంచి మాట్లాడేస్తున్నాడు. స్థానబలిమి కదా మరి. "ఏమిటండీ ఈ మాయలు మంత్రాలు...టి.వి.లోచూసారా? లింగోద్భవం! వెంటనే మెజీషియన్ చేసి చూపిస్తున్నాడు. అసలు ఇలా మెస్మరైజ్ చేస్తుంటేనే వెర్రిజనం వెంటపడుతుంటారు". "మరీ అలా అనకండి సుబ్బారావు గారు..ఏ పుట్టలో ఏ పాముందో... కొందరు దైవాంశ సంభూతులుంటారు" వెంకట్రావ్ గారు సర్దబోయారు. వసంత నెత్తి కొట్టుకుంది లోపల. వెంకట్రావ్ గారు పుట్టపర్తి బాబా భక్తులు,సుబ్బారావ్ మర్చిపోయినట్లున్నాడు, రెచ్చిపోతున్నాడు. "ఏం లేదండీ! అంతా ట్రాష్ డబ్బు సంపాదనకి ఇదో సులభ మార్గం. నాలుగు ముక్కలు నేర్చుకుని, పదిమంది శిష్యుల్ని వెంటబెట్టుకుని ప్రాపగండా చేసుకుంటూ."...ఇంకెక్కడికి వెళ్ళిపోతుందో అని వసంత గబగబా ఉప్మా ప్లేట్లల్లో సర్ది తీసుకొచ్చింది. "చాలా థాంక్సమ్మా! అనవసరంగా శ్రమ తీసుకున్నావు" వెంకట్రావుగారు జీడిపప్పు నోట్లో వేసుకుం


This Page is sponsored by Pediatric and adolescent Care Associates

Pediatric and Adolescent Care Associates

Ravi S. Chennapragada, MD, FAAP

*Board Certified in Pediatrics*
*Experienced and individualized care*

Daytime, evening, or weekend appointments available

*On call 24 hours a day, 7 days week for emergencies*
*Free pre-natal consultation*
*Most insurance plans accepted*

Attending pediatrician at:

*Robert Wood Johnson University Hospital ▪ St. Peter's Medical Center*
*JFK Medical Center ▪ Somerset Medical Center*

*▪ Two convenient locations ▪*

*676 Route 202-206 North, Building 2*
*Bridgewater, New Jersey*
*(908) 927-1155*

*1667 Oak Tree Road*
*Edison, New Jersey*
*(908) 927-1155*

టూ అన్నారు. సుబ్బారావు వాక్ప్రవాహానికి ఉప్మా ఆనకట్ట వేసింది. "అమ్మయ్య, రిటైరయ్యాక మగవాళ్ళకి నోరూ, ఆడవాళ్ళకి పనీ ఎక్కువవుతాయి" అనుకుంది వసంత స్వానుభవంతో. పొద్దున్న అయిదు గంటలకి లేచినప్పటినుంచీ మొదలవుతుంది వసంతకి వంటింట్లో పని, సుబ్బారావుకు హాల్లో పని. జియ్యరు స్వామిగారివి, షణ్ముఖశర్మగారివీ....అందరివీ ప్రవచనాలు క్రమం తప్పకుండా వినడం, వింటూ వ్యాఖ్యానం చెయ్యడం...పేపర్ క్షుణ్ణం గా చదివి ఆ వార్తల్ని గట్టిగా కామెంట్ చేస్తూ వినిపించడం....ఆ రోజుకి ఏం వండాలో ప్లానింగు...ఇదేనా రిటైర్డ్ జీవితం? కాస్త ఆధ్యాత్మిక మార్గం వైపుకి వెళ్లేదెప్పుడు? వసంతకి విసుగొచ్చేస్తోంది. హాయిగా ఏ పల్లెటూరో వెళ్ళి ప్రశాంతంగా ఉండచ్చు కదా! ఎన్నోసార్లు అడిగింది సుబ్బారావుని, పాలవాడి కాలింగ్ బెల్తో కాకుండా పక్షుల కిలకిలారావాల్తో లేవాలనుంది" అని. "మరి పాల్లేకపోతే కాఫీ ఎలాగోయి" మాట పూర్తికాకుండానే తేల్చి పడేస్తాడు సుబ్బారావు. వసంత ఆలోచనల్లో ఉండగానే వినయ్ వచ్చాడు. "పకోడీలు చేస్తావనుకున్నా నమ్మమ్మా! "మరి ముందే చెప్పచ్చు కదా!" "ఏదీ, తాతయ్య చెప్పనిస్తేనా!" ఉప్మా ప్లేటు సింకులో పడేసి, నే వెళ్తున్నా అంటూ వెళ్ళిపోయాడు. రాని పనిమనిషిని తిట్టుకుంటూ గిన్నెలన్నీ తోముకుని, రాత్రికి వంట మొదలు పెట్టింది. ఏదైనా లైట్ గా టిఫెన్ తిందామంటే కుదరదు. చారు అన్నం, మజ్జిగా అన్నం తినకపోతే నిద్ర పట్టదంటాడు సుబ్బారావు. చచ్చినట్లు రెండుపూటలా వంట, ఒక పూట టిఫెన్ చెయ్యవలసిందే. పనంతా అయి, మొహం కడుక్కుని కూర్చోగానే వచ్చారు, ఎప్పుడో కాని కనిపించని స్నేహితురాలూ ఆమె భర్తా, లేని ఓపిక తెచ్చుకుని, టీ ఇచ్చి మాట్లాడుతుంటే వచ్చాడు సుబ్బారావు. వసంత, స్నేహితురాలు మాట్లాడుతుంటే..."హలో" చెప్పుకున్న మగవాళ్లిద్దరూ మాటలు రానట్లే కూర్చున్నారు. నాన్ స్టాప్ గా మాట్లాడే సుబ్బారావు పేపరు పదోసారి సీరియస్ గా చదివేస్తుంటే, స్నేహితురాలి భర్త మ్యూట్-లో ఉన్న టి.వీ. చూస్తున్నాడు. ఓ గంట అయ్యాక "వెళ్దామా" అంది స్నేహితు రాలు. స్ప్రింగ్ లా లేచిన భర్త ఒక్క అంగలో వీధిలో ఉన్నాడు. సుబ్బారావు ఆనందంగా కిందివరకు వెళ్ళి షేక్ హ్యాండ్ ఇచ్చి వచ్చాడు. తర్వాత వసంత దెబ్బలాటకి దిగింది. "నా ఫ్రెండ్స్ ఎవరైనా వస్తే ఎందుకు మాట్లాడరు? మొదట్నుంచీ చూస్తున్నా కదా మీ వరస. అనర్గళంగా ఏ టాపిక్ ఇచ్చినా మాట్లాడే వాళ్ళు నా కోసం ఎవరైనా వస్తే నోటికి ఎందుకు బిరడా వేస్తారు? "అదేం లేదు. ఇందాక వచ్చినాయన చాలా మంచివాడు". "అంటే చెడ్డ వాళ్ళతో కానీ మాట్లాడారా?" "భలే జోకులేస్తావోయ్! ఆహ్హాహ్హా!" జోకు కాదు సీరియస్సే తీక్షణంగా చూస్తూ అంది వసంత. "అదికాదు, ఏం అడిగినా ఒక మాటలో సమాధానం చెప్తుంటే ఏం మాట్లాడతాను? ఉదాహరణకి, కుశల ప్రశ్నలయ్యాక ..." ఏం పేపరు తెప్పిస్తారు? ... "టైమ్స్ ఆఫ్ ఇండియా". "ధరలు చూసారా? ఎలా మండిపోతున్నాయో?"... "నాకు తెలీదు. అంతా మా ఆవిడ చూసుకుంటుంది" "ఏమిటోనండీ ఈ ట్రాఫిక్ రోజు రోజుకీ ఎలా పెరిగిపోతోందో చూసారా? ఇదివరకు గంటలో వెళ్ళేది ఇప్పుడు గంటన్నర పడ్తోంది. ఎక్కడా పార్కింగ్ దొరకట్లేదు"... "అవును". ఈ సినిమాలు చూసారా...ఎంత అర్థం పర్థం లేకుండా తీస్తున్నారో. అసలు ఆ పాటలేమిటీ ఆ డాన్సులేమిటీ? ... "నేను సినిమాలు చూడను"."టి.వీ. లో సీరియల్స్ చూసారా? ఎంత భయంకరంగా ఉంటున్నాయో" ... "నిజమే"....ఇలా ఉంటే ఏం మాట్లాడమంటావు చెప్పు." వసంతకు నవ్వాగలేదు. "ఇన్నాళ్ళకి మిమ్మల్ని మాట్లాడకుండా ఎలా ఉంచాలో తెలిసింది. ఆయనకి థాంక్స్ చెప్పుకోవాలి." "ఎంత డామేజింగ్ గా మాట్లాడుతున్నావు? అంత బోర్ కొడ్తానా!" మాట్లాడకుండా వెళ్ళి రెండు కంచాల్లో అన్నీ పెట్టి డైనింగ్ టేబిల్ దగ్గర పెట్టింది. రెండు కప్పుల్లో మజ్జిగ, చారూ...మారు వేసుకోకుండానే సరిపోతుంది. సుబ్బారావు బిగు సుకుపోయి అన్నం తినేసి, అత్తా కోడళ్ళు సీరియల్ చూడ్డం మొదలుపెట్టాడు. "బాగా కోపం వచ్చింది" అనుకుంది వసంత. "కాసేపు కార్డ్స్ ఆడదామా?" శాంతి జెండా ఊపింది. "ఓ యస్. పద, పూల్ ఎంత వేసుకుందాం?" వసంతకు సుబ్బారావులో నచ్చే అంశం అదే. ఎంత కోపం వచ్చినా మాట మారుస్తే చిన్నపిల్లల్లాగా మర్చిపోతాడు. పేకాట అయి పడుకుని కళ్ళు మూసుకుంటే, మామూలుగా మోగింది ఫోను. "అమ్మా! ఎలా ఉన్నారు?" న్యూజెర్సీ లో ఉన్న కొడుకు. వాళ్లకి ఆదివారం పొద్దున్న కదా! తీరుబడిగా లేచి బ్రేక్ ఫాస్ట్ తిని, తాపీగా కాఫీ తాగి చేస్తాడు ఫోన్. కొంచెం ముందు చెయ్యచ్చు కదా! ఏమైనా అంటే ఆ కాస్తా

చెయ్యరేమోనని భయం వేసి మౌనంగా భరిస్తుంది వసంత. మూసుకుపోతున్న కళ్ళని తెరుస్తూ కార్డ్ లెస్ ఫోన్ చెవి దగ్గర పెట్టుకుని చల్లనినీళ్ళతో మొహం కడుక్కుని వచ్చింది. “బాగున్నాం నాన్నా! మీరెలా ఉన్నారు?” “ఫైన్. డాడీ అప్పుడే డ్రీమ్స్ లోకి వెల్లిపోయారా?” టైం చూసింది వసంత. పదకొండు..రాత్రి పదకొండింటికి నిద్ర పోతుంటే పేళాకోళం. “ఆ! సాయంత్రం మా ఫ్రెండ్స్ విజిట్ కి వచ్చారు. టైర్ అయిపోయి పడుకున్నారు. “మీకు వీలవుతుందో లేదో చెప్పి వచ్చారా? ఎవరు వాళ్ళు?” నీకు తెలీదులే! చెప్పే వచ్చారు. సీత, పిల్లలూ బాగున్నారా? బుజ్జిగాడేం చేస్తున్నాడు? ఎందుకైనా మంచిదని మాట మార్చేసింది. లేకపోతే ఇండియాలో ఎలా మానర్స్ పాటించరో, అమెరికాలో అపాయింట్ మెంట్ తీసుకుంటేనే కానీ తల్లిదండ్రులు కూడా పిల్లల దగ్గరికి ఎలా వెళ్ళరో… అర్ధరాత్రి వరకూ సాగుతాయి బోధలు. “ఓహ్ బుజ్జి! సచ్ ఎ స్వీట్ ఫెలో మమ్మీ...యు నో తన పనులన్నీ తనే చేసుకుంటానంటాడు. ఇవేళ లాన్ మో చేస్తానని పేచీ పెడ్తున్నాడు. వాడికి హాండిల్ అందదు కదా! నేను ఎత్తుకుని వాడే చేస్తున్నట్లు చెయ్యాలి. ఇంక పింకీ అయితే అన్ బిలీవబుల్...” మనవల ముచ్చట్లన్నీ కళ్ళు పెద్దవి చేసుకుని వింది వసంత. పెట్టబోయే సమయం వచ్చినప్పుడు అడిగింది, “సీత ఏం చేస్తోంది?” “సీతూ! మామ్ వాంట్స్ టు టాక్ టు యు.” “వస్తున్నా”! హాలో సీతా ఎలా ఉన్నారమ్మా? “బాగున్నాం. అత్తయ్యగారు! మీరెలా ఉన్నారు?” “పింకీకి మాటలేమైనా వచ్చాయా? తన్ని చూడాలని మనసు పీకుతోందమ్మా! అది పుట్టాక చూడలేదు కదా! కంప్యూటర్లో వచ్చే ఫోటోలు తప్ప.....”మాటలేం రాలేదండి. మీ అబ్బాయి మాట్లాడతారట” టపీమని ఫోను అబ్బాయికిచ్చేసింది. అమ్మా! ఇంకేంటి విశేషాలు? నాన్నతో మాట్లాడనే లేదు. మళ్ళీ చేసినప్పుడు మాట్లాడతాలే. ఉంటా. ఆరోగ్యం జాగ్రత్త” కార్డ్ లెస్ పక్కన ఉన్న టీ పాయ్ మీద పడేసి మంచం మీద వాలింది వసంత. గుండెలో ఏదో ఖాళీ అయినట్లుగా అనిపించింది. కళ్ళు మూసుకుంటే తేలిపోయిన నిద్ర కోపం వచ్చి ఎక్కడికో వెళ్ళిపోయింది. ఇంక ఇవేళ అంతా జాగారం అనుకుని లేచి కూర్చుంది. ఏమిటి దీనికి పరిష్కారం? కంటి నిండా తృప్తిగా నిద్రపోయి ఎన్నాళ్ళైందో! చెప్పుకుందామంటే ఎవరూ లేరు. సుబ్బారావుకి నిద్ర పట్టకపోవడం అనేది ఒక ప్రాబ్లం లా అనిపించదు. అదంతా ఇమాజినేషన్, కళ్ళు మూసుకుని పడుకోడాన్నే “నిద్ర” అంటారు, అని కొట్టిపడేస్తాడు. రేపు డాక్టర్ దగ్గరికి వెళ్ళాలి అనుకుంటూ హాల్లోకి వెళ్ళి పుస్తకం తీసింది. చదువుతుంటే ఎప్పటికో, ఏ రెండింటికో కునుకు పట్టింది.


THIS PAGE IS SPONSORED BY VENKAIAH DAMA

VENKAIAH DAMA MS PE. CLU. ChFC

143-02 45· AVE. FLUSHING, NY 11355
PHONE: (718) 886 4077 FAX: (718) 886 7007
PHONE®: (718) 762 7173 E-mail: venkaiah.dama@nmfn.com

(In Financial Services since 1976)



TAX SAVINGS and/or DEFERRALS

JOINT COMPLIFE INSURANCES
529 COLLEGE SAVINGS PLAN
FIXED & VARIABLE ANNUITIES
IRAS: REGULAR, ROTH, SEP, SIMPLE & NON-QUALIFIED
KEOGH & CORPORATE PENSION PLANS
REQUIRED MINIMUM DISTRIBUTIONS
FOUR WAYS TO REDUCE CAPTIAL GAIN TAXES




**Asalatha "Asha" Vikuntam**

Realtor Associate



**Community Expert**

**2005 Member of Mercer County Board of Realtors**

**Cranbury Resident since 1999**

**Marketing Specialist**

Century 21

**Abrams, Hutchinson & Associates**

**10 Schalks Crossing Road**
**Plainsboro, NJ 08536**
**609-750-7300**
**Cell Phone 732-470-4717**

“అల్లాహో అక్బర్ ...” మైకులోంచి గట్టిగా అల్లాని పిలవ డమే కాకుండా ఒక అరగంటసేపు భజనలు. ఉలిక్కిపడి లేచింది వసంత. టైము నాలుగున్నర. నాలుగిళ్ళ అవతల ఉన్న మసీదు లోంచి రోజు వచ్చే మేలుకొలుపు. ఎవరైనా ఏమైనా అంటే “మీ వినాయకచవితికి పెట్టట్లేదా మైకులు” అంటారు. నిశ్శబ్దంగా ప్రార్ధిస్తే, అల్లాకి కానీ వినాయకుడికి కానీ వినిపించదా! కాళ్ళు సాగదీసు కుంటూ లేచింది వసంత. కాఫీ డికాక్షన్ వెయ్యడానికి. కాల కృత్యాలు తీర్చుకుని కాఫీ కలపడానికి పాలు తీద్దామని ఫ్రిజ్ తీసింది. లోపల్నుంచి సాంబారు గిన్నె పిల్లిమొగ్గలేసుకుంటూ కిందికి దూకింది. చెయ్యి నుదిటికానించి “అయ్యో” అనుకుంది వసంత. నిన్న మధ్యాహ్నం పొరపాట్న సాంబారు గిన్నె ఫ్రిజ్ లో పెట్టమని సుబ్బారావుకి చెప్పింది. హాండిల్ ఉన్న కాపర్ బోటమ్ గిన్నె అలాగే పెట్టేశాడు. హాండిల్ తలుపులో చిక్కుకుపోయి తనతో గిన్నెని కూడా లాక్కుంది. వసంతకి గట్టిగా ఏడవాలనిపించింది. కానీ, మరీ ఈ వయసులో ఏడుస్తే బాగుండదని, నడుం పట్టుకుని వంగి అంతా బాగుచేసింది. అంతా అయి పాలు పొయ్యి మీద పెట్టుండగా మొదలయ్యాయి, హాల్లో సుబ్బారావు టీ.వీ. చప్పుడు, రోడ్డు మీద కార్లు, ఆటోల హారన్ చప్పుళ్ళు....పక్క ఎపార్ట్ మెంట్ వాళ్ళ రేడియో, ఎదురు కుండా వాళ్ళ టేప్ రికార్డర్...లాభం లేదు, ఈవేళ తాడో, పేడో తేల్చాల్సిందే. కాఫీ కప్పులు తీసుకుని హాల్లోకి వెళ్ళి టీ,వీ. కట్టేసింది. “ఏంటోయ్ సంగతి? ఇవేళ వాతావరణం అంత బాగున్నట్లు లేదే!” “నాకు సౌండ్ పొల్యూషన్ తో, ఇంటి చాకిరీతో పిచ్చెక్కిపోతోంది. ఏదైనా ఉపాయం ఆలోచించండి. ఇంక నావల్ల కాదు. ఇదివరకు కోడళ్ళు చేతిలో పనందుకునే వారు. పెద్దవాళ్ళు మనవళ్ళతో కాలం గడుపుతూ పురాణాలకి వెళ్తూ కాలక్షేపం చేసేవారు. ఇప్పుడు...ఇలా మనిద్దరం, ఎన్ని రోజులు అన్ని పనులూ చేసుకుంటూ గడపాలి?” వసంతకి ఏడుపుతో గొంతు పూడుకు పోయినట్లయిపోయింది. రాత్రి కొడుకు, కోడలు మాట్లాడాక మరీ అలజడిగా అయిపోయింది మనసు. “ఎక్కడికైనా వెళ్ళిపోదాం, ఫోను, కాలింగ్ బెల్ లేని చోటికి”. “అలాగే. విజయవాడ హైవేలో ఏదో ఆశ్రమం ఉందట. ఇవేళే వెళ్ళి చూద్దాం. వంట అదీ మొదలు పెట్టకు.” సుబ్బారావు అంత సులభంగా వొప్పుకుంటాడని అనుకోలేదు వసంత. ఆనందంగా లేచి తయా రైంది. కారులో ఆశ్రమానికి వెళ్ళడానికి రెండు గంటలు పైన


# Livingston Pediatrics

*You are our top priority!*

American Academy of Pediatrics

About Us . . . We handle the health care needs of infants, children and adolescents. Prenatal counseling is also available.

We will do our best to see that your child's health needs are served appropriately and quickly. Our practice has an experienced staff available to answer your questions.

Full modern office with electronic medical records.



**Dr. Ramalakshmi Yeramilli, MD**
Member of the AAP,
Board Certified in Pediatrics
Robert Wood Johnson University Hospital
St. Peters University Hospital, New Brunswick

www.livingstonpediatrics.com

**New Patients Welcome!**

**We handle the health care needs of infants, children and adolescents.**

**732-246-7171**
345 Livingston Ave.
New Brunswick, NJ 08901
Fax: 732-246-8974
Habla español, Hindi, Telugu

Office hours:
Monday - Saturday
Evening appts. available
By appointment only

Accepting Most Insurances

పట్టింది. దారిలో ట్రాఫిక్ జాం రెండుచోట్ల. అలాగే అడ్డదిడ్డంగా వచ్చే వాళ్ళని తిట్టుకుంటూ ఎలాగైతేనేం ఆశ్రమం ముందు కారు పార్క్ చేసి దిగారు. ఒక పక్క కొండలు, ఇంకో పక్క చెట్లు, ఎంతో ఆహ్లాదంగా ఉంది వాతావరణం. అక్కడక్కడ చిన్న చిన్న కాటేజీలు, కాటేజీల ముందు బుల్లి బుల్లి గార్డెన్లు...లోపలికి వెళ్తూనే సంబరపడిపోయింది వసంత. "అబ్బ! అచ్చు నేను కలల్లో ఊహించుకున్నట్లే ఉంది." సుబ్బారావుకి కూడా నచ్చింది. ఫోన్ చేసి వెళ్ళారెమో, కారు ఆగగానే మేనేజర్ వచ్చేసాడు. "రండి ... రండి, వెల్కం టు అవర్ ఏంజల్స్ హోం" హడావుడిగా వాళ్ళని లోపలికి తీసుకుని వెళ్ళాడు. "ఏం తీసుకుంటారు? కాఫీ, టీ, కూల్ డ్రింక్ ..." "కాఫీ తెప్పించండి" రెండు గంటలు ట్రాఫిక్ లో పడి వచ్చేసరికి తల నొప్పి పట్టుకుంది వసంతకి. మానేజర్, వాళ్ళ ఆశ్రమం గురించి ఆపకుండా అనర్గళంగా మాట్లాడుతున్నాడు. ఫుల్ స్టాప్, కామాలు అవతలి వాళ్ళు పెట్టుకోవలసిందే. "కాఫీ ఏమిటి? అదోరకంగా ఉంది!" ఏదో తెలియని వాసన వేసింది. ఏదైనా బల్లి కానీ పాలల్లో పడలేదు కదా. వసంతకి భయం వేసింది. కాఫీ బైటికి వచ్చినంత పనైంది. మన బాడీకి అవసరమైన అమైనోయాసిడ్స్ ఎక్కువగా ఉంటాయని గొర్రె పాలు వాడతాం. అందుకని మీకు కొత్తగా ఉండచ్చు". మానేజర్ గొర్రె పాలు ఒంటికి ఎంత మంచివో, దాని మూలాన ఎచ్.డి.యల్ కొలెస్టరాల్ ఎంత పెరుగుతుందో, ఎల్.డి.యల్ కొలెస్టరాల్ ఎలా తగ్గుతుందో, తల వాచేలా చెప్పాడు. వసంతకి తలనొప్పి పది రెట్లు ఎక్కువైంది. సుబ్బారావుకి ఆ బాధ లేదు. చిదానంద పురుషుడు. తనకంటే ఎక్కువ మాట్లాడేవాళ్ళు ఎదురు పడ్తే వెంటనే విత్ డ్రా అయిపోయి అదో లోకంలోకి వెళ్ళిపోతాడు. "ఒకసారి చూద్దామా?" ఎలాగో వీలు చూసుకుని అడిగాడు సుబ్బారావు. కాటేజీల దగ్గరికి వెళ్లారు. ఒక్కో కాటేజ్ లో రెండు భాగాలున్నాయి. మొదటి కాటేజ్ లో డెబ్బైఏళ్ళ రావుగారున్నారు. దాన్ని అనుకున్న దాంట్లో ఇంచుమించు అదే వయసు దంపతులున్నారు. మానేజర్ని చూసి తగులుకున్నారు రావుగారు. "ఏంటండీ? టీ.వీ . లో అన్ని ఛానల్స్ రావట్లేదు...యం.టి.వి. నాకెంతో ఇష్టం. అదేమో బ్లర్డ్ గా వస్తోంది. హెచ్.బి.ఓ. అసలే లేదు. యు నో వియ్ ఆర్ పేయింగ్ త్రూ అవర్ నోస్...." "వస్తుందండీ, రేపటికి తెప్పిస్తా". పక్క కాటేజ్ లో దంపతులూ చిన్న పిల్లల్లా దెబ్బలాడుకుంటు న్నారు. ఆవిడ చెరిగేస్తోంది. "మీకు తెలుసా...నాకు తెలుసా యాభై అయిదేళ్ళ అనుభవం. తేలిగ్గా తీసి పారేస్తారేంటి?" "ఏమిటే నీకు తెలిసిం ది ... అసలు నీకు వంట వచ్చా? అన్నాళ్ళు ఎలా తిన్నానో ఆశ్చర్యంగా ఉంది. ఎప్పుడైనా తిన్నగా ఉప్పు, పులుపు వేసి ఏడిచావా?" ఆయన గొంతు ఇంకా పెంచాడు. "మంచిది. అందుకే ఇక్కడ రుచిలేని చప్పిడికూడు అఘోరిస్తున్నాం." "ఏమైందండీ? మానేజర్ కంగారు పడ్తూ అడిగాడు. "నిన్న ఆనపకాయ కూర అల్లం వేసి వండారంటాను నేను, కాదు నూపిండి దట్టించారంటుంది మా ఆవిడ. ఎంచక్కా అల్లం వాసన ఘుమాయిస్తుంటే అడ్డంగా వాదిస్తోంది. ఈసారి డాక్టరొచ్చినప్పుడోసారి దీని ముక్కు చూపించాలి. అన్నట్లు, డాక్టరెప్పుడు వచ్చాడు ఈ మధ్యన కనిపించలేదే?" "ఎక్కడా! పదిహేను రోజులైంది" నిష్టూరంగా అంది ఆవిడ. ఉన్నట్లుండి ఆదర్శ దంపతులై పోయారు వాళ్ళు. ఇద్దరూ కలిసి మానేజర్ని పావుగంట ఏకేసారు. "నిన్న ఈనాడు పేపరు వెయ్యలేదు. మొన్న మజ్జిగ మరీ నీళ్ళలా ఉంది. నాలుగు రోజుల్నించీ బాత్రూంలు కడిగే వాడు రావట్లేదు....ముక్కు బద్దలయ్యే కంపు." "ఎందుకొచ్చాంరా బాబు! అనుకుంటూ మానేజర్ బైటికి నడిచాడు. వెనకాలే వసంత, సుబ్బారావు. ఇంక కాటేజీలకి తీసుకెళ్ళే ధైర్యం చెయ్యలేదు మానేజర్. కామన్ హాలు, కిచన్, లైబ్రరీ, గుడి చూపించాడు.

తరువాత బాగా పెరిగిన తోటని గంటసేపు చూపిస్తూ వాళ్ళ ఆశ్రమం గురించి చెవులు గళ్ళు పడేలా వివరించి, భోజనాల హాలుకి తీసుకెళ్ళాడు. హాలంతా నిండిపోయింది. దెబ్బలాడుకున్న దంపతుల బల్ల దగ్గరే రెండు ఖాళీలున్నాయి. ఓడిపోతామని తెలిసీ యుద్ధం చెయ్యక తప్పని సైనికుడిలా మొహం పెట్టి, అక్కడికే తీసుకెళ్ళాడు మానేజర్, తెచ్చి పెట్టుకున్న నవ్వుతో. పెద్దావిడ వీళ్ళని చూడగానే నవ్వుతూ ఆహ్వానించింది. అన్నీ పింగాణీ పళ్ళాలు, గాజుగ్లాసులు...శుభ్రంగానే ఉన్నట్లు అనిపించింది. పదార్థాలు కూడా ఫరవాలేదన్నట్లున్నాయి. తింటూ పక్కావిడ్ని కదిలించింది వసంత. "ఇక్కడ పక్కనే హైవే ఉంది కదా! గొడవ చాలా ఉంటుందా!" "అబ్బో అడక్కండి, రాత్రిళ్ళు నిశ్శబ్ద వాతావరణంలో లారీ హారన్ లు మరీ భయంకరంగా వినిపిస్తుంటాయి.

# BALACHANDAR JAYARAMAN CPA LLC

**CERTIFIED PUBLIC ACCOUNTANT**
**BUSINESS CONSULTANT**
**719 Inman Avenue, Suite # 201, P.O. Box 117**
**Colonia, NJ 07067**
**www.jayaramancpa.com**

**Email: Bala@JayaramanCPA.com**
**732-943-7605 (Tel)**
**732-539-0924 (Cell)**
**732-909-7122 (eFax)**

**Member: AICPA**
**Member: NJSCPA**
**Licensed as CPA in NJ & IL**



**Free Initial Consultation** **Low Cost / High Quality Service**

## Prompt & Individual Attention by a CPA

**On-Time Performance** **High Customer Satisfaction**

- *Tax Planning, Preparation and Representation*
- *Accounting and Auditing Services*
- *New Business Consultation*
- *Financial Statements: Compilations, Reviews & Audits*
- *Sales Tax and Payroll Tax Returns*
- *Financial and Compliance Services for Government Programs*

*For Corporations, Partnerships, Individuals, LLC/ LLP & Non-Profits*

*CALL BALA JAYARAMAN CPA @ 732-943-7605*

తెల్లవార్లు విరామం లేకుండా వెళ్తుంటాయి." "పెన్షన్ బెనిఫిట్స్ అన్నీ ఇక్కడ పెట్టాం కనుక ఇక్కడ ఇరుక్కుపోయాం. మాకు పిల్లల్లేరు. ఎక్కడైతే ఏం లే అనుకున్నాం. కానీ ఇక్కడా పాలిటిక్సే" ఆవిడ భర్త అన్నాడు. "పిల్లలుంటే మాత్రం ఏంలే" అనుకుంది వసంత. "మేడం! బయలుదేరదామా? మేనేజర్ వచ్చేశాడు. ఆఫీసు రూంకి వెళ్తూ అడిగింది వసంత "ఇక్కడికి దగ్గర్లో ఏదైనా హాస్పిటల్." సరిగ్గా పదిహేను కిలోమీటర్ల దూరంలో, కామినేని సూపర్ స్పెషాలిటీ ఉంది మేడం.. అక్కడ లభ్యమయ్యే సేవలన్నీ ఆ హాస్పిటల్ పి. ఆర్. ఓ. లా వివరించాడు. "ఎంత కట్టవలసి ఉంటుంది?" మేనేజర్ చెప్పిన అంకె చూస్తే గుండె ఆగినంత పనైంది. అంతా డాలర్లలో ఉంది వ్యవహారం. "మళ్ళీ కలుస్తాం" అని చెప్పి బయటపడ్డారు వసంతా, సుబ్బారావు. తిరిగి వచ్చేటప్పుడు మరీ కష్టమైంది. చాలా దూరం రోడ్డు మూసేసారు. అప్పటికప్పుడు అనుకుని రిపేర్ మొదలు పెట్టినట్లున్నారు. మధ్యలో మామూలు గా ట్రాఫిక్ జామ్. కామినేనికి చేరేసరికే రెండు గంటలు పట్టింది. ఎమర్జెన్సీ వస్తే అంతే సంగతులు అనుకుంది వసంత. ఇంటికి చేరి తలుపు తియ్యగానే గట్టిగా ఊపిరి పీల్చుకుంది. లోపలికి వచ్చీ రాగానే వెంకట్రావుగారు, రామారావుగారు తయారు. వాళ్ళని చూడగానే ప్రాణం లేచొచ్చినట్లు అలసట మర్చిపోయి వాకింగ్ కి వెళ్ళిపోయాడు సుబ్బారావు. డికాక్షన్ వేసుకుని కమ్మటి కాఫీ తాగి వంట ప్రయత్నంలో పడింది వసంత. సుబ్బారావు వస్తూనే ఒక ముప్పయి ఏళ్ళ స్త్రీని తీసుకొచ్చాడు. "వసూ! ఈ అమ్మాయి పేరు లక్ష్మి. పొద్దున్న, సాయంత్రం వంటచేసి వెళ్తుందిట. జీతం పదిహేనువందలు. రేప్పొద్దున్నించీ రమ్మన్నాను. సత్యం గారింట్లో రెండేళ్లనించీ చేస్తోందిట. వాళ్ళు అమెరికా వెళ్తున్నారు. "ఎవరైనా ఉన్నారా?" అని అడిగారు సత్యంగారు. ఆ అమ్మాయికి మూడిళ్ళ ల్లో పనిచేస్తేగాని గడవదట. బాగా చేస్తుందిట" వసంతని అడగకుండానే కుదిర్చేసాడు. నమస్కారం పెట్టి వెళ్ళిపోయింది లక్ష్మి, మర్నాటినుంచీ వస్తానని. వంట ముగించి రాగానే వసంతతో అన్నాడు సుబ్బారావు. "సారీ వసూ! నువ్వుకూడా రిటైర్డ్ లైఫ్ లో విశ్రాంతి కోరుకుంటావని ఊహించలేకపోయాను. రేపట్నుంచీ మనిద్దరం టి.వీ. చూస్తూ పేకాడుకుంటూ హాయిగా గడుపుదాం. ఎక్కడుంటే అక్కడే మనశ్శాంతిని వెతుక్కోవాలి. మనం పడుకునేటప్పుడు "డోంట్ డిస్టర్బ్" బోర్డ్ పెట్టేద్దాం. కొత్తల్లో బడాయి అనుకున్నా అదే అలవాటైపోతుంది. రాత్రి పూట ఫోను తీసి పక్కన పెట్టేద్దాం. ఎవరైనా మనం మెలకువగా ఉన్నప్పుడు చెయ్యవలసిందే. అంత దూరంలో ఆశ్రమాలలో మనం ఉండలేం వసూ. సాయంత్రం పక్కనున్న గుడికి వెళ్ళు. కావలసినంత ఆధ్యా త్మికత, ప్రశాంతత. వీలైనంత వరకు పని తగ్గించుకో. కావాలంటే ఇంకో పనిమనిషిని పెట్టుకుందాం. నేనుకూడా డ్రైవర్ని పెట్టుకుం టున్నాను. ఈ వయసులో మనకి మనుషులు కావాలి చేయూ తకి. అంతే కానీ ఎక్కడికో పారిపోలేం. ఇప్పుడు ఎన్నో ఏజన్సీల వాళ్ళు ఏ సేవలకి కావాలన్నా సహాయం పంపుతున్నారు. ఇదే మన సమస్యకి పరిష్కారం. ఏమంటావు?" సుబ్బారావు మాటలకి మూతి మూడు వంకరలు తిప్పింది వసంత, కళ్ళల్లో నవ్వు కదలాడుతుండగా.

## ప్రసాదింట్లో పిడుగుపడింది

డా. చింతపల్లి గిరిజా శంకర్

ప్రసాదూ, సుమా ఆవూరొచ్చి పది ఏళ్ళయింది. ఇద్దరూ డాక్టర్లు. వాళ్ళకిద్దరు పిల్లలు, కృష్ణ ఎనిమిది, రమ్య అయిదు. పెద్దయ్యాక వాన ప్రస్థంలో "రమ్యా కృష్ణా" అనుకుంటూ కాలం వెళ్ళ బుచ్చవచ్చని ఆ పేర్లు పెట్టుకున్నారు. ప్రసాద్ చాలా అడావుడి మనిషి. ఎప్పుడూ అరవై మైళ్ళ స్పీడులో వుంటాడు. ఎలెక్ట్రానిక్స్ అంటే చాలాయిష్టం. దేశంలో కొత్త ఎలెక్ట్రానిక్ గాడ్జెట్స్ రావడం ఆలస్యం వెంటనే రాత్రికి రాత్రి, అవసరమైతే లైన్లో నించొని కొను క్కుంటాడు. అలాగే టి.వి లూ, మిగిలిన గాడ్జెట్స్. మరెప్పుడు టైముంటుందో, యు-ట్యూబ్ లో ఎక్కడలేని వింతవార్తలన్నీ చూస్తాడు. మళ్ళీ ఎప్పుడుచూసినా హడావిడే! తీరికలేనట్టు చక చకా వెళ్ళిపోతుంటాడు. ఇట్లాంటి న్యూస్ యూ-ట్యూబ్ లో చూట్టా నికి ఎప్పుడు సమయం చిక్కుతుందో పెద్ద రహస్యం. ఇంకొక పాషన్ అతనికి యూ-ట్యూబ్ లొ ట్రెయిన్స్ చూట్టం. ఇంటికెవ రొచ్చినా వాళ్ళకవి చూపిస్తాడు. అతని బ్రెయిన్ ఒక ఎన్సైక్లోపీ డియా.అతని బుర్ర నిండా గ్రేమాటరే. మెమొరీ అత్యద్భుతం. ఏవిషయమడిగినా అన్ని పూర్వాపరాలతో సహా చెప్తాడు.



For the if in life®
Employee Benefit Plans
Executive Benefit Plans
Pension & Profit Sharing Plans
401(k), 403(b), SEP, 412(i) Plans
Health Insurance
Business Buy Sell Insurance
Commercial Insurance
Life Insurance
Long-Term Care Insurance
Disability Income Insurance
IRA, Roth IRA & Annuities
Retirement Planning
Estate Conservation Strategies
Auto and Home Insurance
MetLife®
One Blue Hill Plaza, 2nd Floor
P.O Box 1666, Pearl River, NY 10965
www.joseph.metlife.com
Tel. : 845-620-3115
Cell. : 845-323-3666
Get a Quote FREE
George Joseph
Financial Services Representative
Investment Adviser Representative
e-mail: gjoseph@metlife.com
CA Lic.# OE85378
Metropolitan Life Insurance Company(MLIC), New York, NY 10036.
Some health insurance products offered by unaffiliated insurers through the Enterprise General Insurance Agency Inc.(EGA), 300 Davidson Avenue Somerset, NJ 08873-4175.
Securities and investment advisory services offered by MetLife Securities, Inc. (MSI) (member FINRA/SIPC), and a registered investment advisor. Auto and Home Insurance offered by Metropolitan Property and Casualty Ins. Co. (Met P&C®) and affiliates, Warwick, RI. MLIC, the EGA, MSI and Met P&C® are MetLife companies.
L1210150024[exp0112][AZ,CA,CT,FL,GA,MA,MD,NC,NJ,NY,OK,PA,TX,VA]

సుమ నెమ్మదస్తురాలు. నిమ్మకు నీరెత్తినట్టు నిండుగా హుందాగా ఉంటుంది. ఇతన్ని చొక్కా పట్టుకొని లాగుతూ స్లో డౌన్ చేస్తుంటుంది. ఈయనకున్న హైపరాక్టివ్ పర్సనాలిటీకి ఒక అనూహ్యమైన హాబీ వంటచెయ్యడం. అదిమటుకు బాఘా ఎంజాయ్ చేస్తాడు (పిల్లలు ఎంజాయ్ చెయ్యకపోయినా) చాలామంది ఫ్రెండ్స్ అతని వంటని మెచ్చుకుంటారు. కానీ, సుమా, పిల్లలూ మాత్రం అంత గొప్పగా పొగడ్రు. ఒచ్చిన కొత్తల్లో వాళ్ళకొక ఫిఫ్టీ ఇంచ్ లార్జ్ రియర్ ప్రొజెక్షన్ టివి వుండేది. అతనికి టివి చూట్టం, దానికన్ని రకాలైన గాడ్జెట్స్ తగిలించడం, సౌండ్ సిస్టం ఇత్యాది చాలా అర్భాటాలు పెట్టి టివి చూట్టం సరదా. దాన్లో క్రికెట్, టెన్నిస్ అవీ చూస్తాడు. బాగా ఆనందిస్తాడు అవి చూస్తూ. యూట్యూబ్ సరేసరి. సుమ టివి చూడదు. చిన్నపిల్లలకి డాన్స్ నేర్పుతుంది. ఇంట్లోని "బయట" పన్లు, అంటే పిల్లల్ని అక్కడికీ ఇక్కడికీ తీసికెళ్ళడం, వాళ్ళ స్కూల్ విషయాలు ఇలాటివన్నీ చూస్తుంటుంది. పిల్లల్ని టెన్నిస్ గేంస్ కి ఇంకోవూరికి తీసికెళ్ళడం గూడా తనే. ప్రసాద్ హోం బౌండ్. హాబీస్ వంట చెయ్యడం, యూట్యూబు. వాళ్ళింటిచుట్టూ చాలా పెద్ద పెద్ద నీడనిచ్చే చెట్లు మొత్తం ఇరవైదాకా ఉన్నాయి. చాలా నీడగా ఎండాకాలంలో చల్లగా వుండి, AC బిల్లు తక్కువగా వుండేట్టు చూస్తాయి. ఒక రాత్రి పెద్ద థండర్ స్టార్మ్ వచ్చింది. (గాలివాన) పెద్ద పెద్ద మెరుపులూ, ఉరుములూ, పిడుగులూ, వడగళ్ళవానా... అందరూ అప్పటికే నిద్రపోతున్నారు కాబట్టి ఇంకా ముసుగు తన్ని ముడుచుకు పడుకున్నారు. అయిదేళ్ళ రమ్యకి భయం పుట్టి అమ్మపక్కలో జేరింది. తెల్లవార్లూ వర్షం పడుతూనేవుంది. మూడు గంటల టైంలో పెద్ద ఉరుములతో కుండపోతగా వర్షం విజృంభించింది. దరిదాపుల్లో పిడుగులు పడ్డాయి. కరెంట్ పోయింది. ఒక అరగంట తరవాత కరెంటొచ్చింది. అలాగే నిద్రపోయారు. మామూలుగా ఆరింటికి అలారం మోగింది. అందరూ లేచారు. ప్రసాద్ కి పొద్దున్నే కాఫీ తాగుతూ టివి లో న్యూస్ చూట్టం అల వాటు. ఆన్ చేస్తే టివి పంజేయలేదు. బెడ్రూం లో టివి ట్రై చేశాడు. అది బాగానే వుంది. ఆ సాయంత్రం రిపేర్-మన్ ని పిలిచాడు. వాడొచ్చి, అవీ ఇవీ చూసి లైట్-నింగ్ డామాజ్ వచ్చిందనీ, రిపేర్ ట్రై చేస్తే 400 డాలర్ల వుతుందనీ, గారంటీ ఇవ్వలేననీ చెప్పాడు.

ఒకవేళ తనను కున్నదే అయినా ఆ పార్ట్ ఇంకా 400 అవుతుందనీ...మొత్తమ్మీద తడిసిమోపెడనుకున్నాడు ప్రసాదు. అది వాయిదావేసి ఇన్సూ రెన్స్ వాళ్ళకి ఫోన్ చేశాడు. వాళ్ళు లైట్నింగ్ డామాజ్ కాబట్టి కవర్ అవుతుందని చెప్పారు. సరే ఫారాలన్నీ పూర్తిచేశాక ఒకానొకనాటికి అతనికి ఇన్సూరెన్స్ వాళ్ళు రి ఇంబర్స్మెంట్ చెక్ పంపించారు. తనకి చాల సంబరమేసింది. తనుకొన్నది పాతికవందల డాలర్లకి, వాళ్ళిచ్చింది రెండువేల డాలర్లు. అప్పటికే అది కొని నాలుగేళ్ళయింది. ఆ మర్నాడు బెస్ట్-బై కి వెళ్ళి రెండు వేల-డాలర్లకి ఇంకా పెద్దది, ఎల్సిడి, లేటెస్ట్, వాల్-మౌంట్, ఇంత కుముందున్నదానికన్నా అన్నివిధాలా నవ్యమైనది, కొనుక్కున్నాడు. ఎలెక్ట్రానిక్స్ ప్రతీ సంవత్సరం చవకవ్వడం తనకి లాభసాటేననుకున్నాడు. అంతేకదామరి. చేతిలో పైస పెట్టకుండా, ఇన్సూరెన్స్ ఇచ్చిన డబ్బుతో ఇంకా బెటర్ టివి కొనుక్కోగలిగాడు కదా. ఇంటికి వచ్చిన ఫ్రెండ్స్ అందరికీ చూపించేవాడు గర్వంగా. లాటరీలో మిలియన్ డాలర్లొచ్చిన ఆనందం అనుభవిచ్చేవాడు. ఇంటికొచ్చిన ఫ్రెండ్స్ అతని టివి చూసి, "మాగ్గూడా లైట్నింగ్ వస్తే బాగుంటుందయ్యా. మేంగూడా ఇంకా పెద్ద టివి కొనుక్కుందామనుకుంటున్నాం" అని జోకేవారు. ఇలా నాలుగేళ్ళు గడిచిపోయాయి. కృష్ణకి పన్నెండేళ్ళు, రమ్యకి తొమ్మిది. ఇద్దరూ ఇప్పుడు మిడిల్-స్కూల్ లో వున్నారు. కృష్ణ ఎప్పుడెప్పుడు పెద్దవాణ్ణవుతానో, ఎప్పుడు తను డ్రైవ్ చేస్తానో అని తెగ తహతహలాడిపోతున్నాడు. తన బెడ్ రూంలో ఒక టివి వుంటె బాగుణ్ణనుకోటం మొదలెట్టాడు. ప్రసాద్ తమ బెడ్రూంలో టివి వాడికిచ్చాడు. చాలా పాతది, చిన్నది, పాత మోడల్. కృష్ణకి నచ్చలేదది. ప్రసాద్ ఇంకో కొత్తది కొంటానికిష్టపళ్ళేదు. ఇంతలోకీ కృష్ణ పుట్టినరోజొచ్చింది. ఆరోజందరూ గుడికెళ్ళారు. అర్చన చేయించారు. అందరూ భక్తిగా దణ్ణాలు పెట్టి, గుంజీళ్ళుతీసి, ప్రార్థనలు చేశారు. అయిపోయాక ప్రసాదడిగాడు కృష్ణని, "ఏం కోరుకున్నావు దేముణ్ణి?" కృష్ణ సమాధానం, "మనింట్లో మళ్ళీ పిడుగుపడి నా టివి పాడయిపొ వాలనీ, అప్పుడు ఇన్సూరెన్స్ డబ్బుతో కొత్త టివి కొనుక్కోవాలనీ కోరుకున్నాను."

ప్రసాద్ గుండెలలో పిడుగు పడింది!

Daughter: Mommy, what's it like to have the most awesome daughter in the world?

Mother: I don't know, ask your grandmother.

## సమయోచితం

**శ్రీమతి భావరాజు భారతి**

“నేను మళ్ళీ మా ఇంటికి వస్తానా?”, “నువ్వు నన్ను అక్కడ చూడడానికి వస్తావు కదూ?”, “ఇంకా ఎంత కాలమో ఇల్లా బ్రతకడం?” “అసలు భగవంతుడు నాకు ఎందుకిలా చేశాడు?” అన్న 86 సంవత్సరాల వయసున్న కమలమ్మగారి ప్రశ్నలు విన్నప్పుడు, మనసులో ఏదో తెలియని కలవరమేర్పడింది. ఆవిడ ఎంతో ఆర్ద్రతతో అన్న మాటలనిపించింది. ఆమె ప్రశ్నలకి ఏవిధమైన సమాధానం చెప్పలేని పరిస్థితిలో ఉన్న నాకు మాట రాలేదు. నిజమే, వృద్ధాప్యంలో, తనకు తానుగా జాగ్రత్త తీసుకోలేని సమయమొస్తే వృద్ధాశ్రమానికి పంపాలని పిల్లలు నిర్ణయం తీసుకున్నప్పుడు, అది తన మంచికేనని కమలమ్మగారికి తెలిసినా, ఆమె మనస్సు ఒప్పుకోలేదని నాకు అర్థమయింది.

కమలమ్మగారికి, నాకు చిరకాల పరిచయం. భర్త పోయిన వెంటనే గత పదహారు సంవత్సరాలుగా ఆమె కొడుకు, కోడలు, మనుమలతో అమెరికాలో వుంటున్నారు. వయస్సుతో బాటు కమలమ్మగారి ఆరోగ్యంలో కొన్ని మార్పులొచ్చాయి. మందులు, ఆహారంలోని మార్పులతో రోజులు గడుపుకొస్తున్నారు. ఒక సంవత్సరంగా ఆమెకి చూపు తగ్గడం, కాలక్రమేణా అసలు కనిపించకపోవడం ఆమెకే కాక కుటుంబంలో అందరికీ బాధ కలిగించింది.

కమలమ్మగారికి ఎనభయ్ సంవత్సరాలు నిండడం, నేను ఉద్యోగం వదలిపెట్టడం ఒకే సంవత్సరంలో జరిగాయి. ఆరు సంవత్సరాలుగా ప్రతి మంగళవారం కాసేపు కమలమ్మగారి ఇంటికెళ్ళి, దగ్గర కూర్చొని, క్షేమ సమాచారాలు మాట్లాడుకుని, జరిగిన వారంలోని కబుర్లు చెప్పుకునేవాళ్ళం. మిగత సమయంలో భగవద్గీత, సుందరకాండ, గజేంద్ర మోక్షము ఇలా ఏవో కమలమ్మగారికి నచ్చిన పుస్తకాలు చదువుతూ గడిపేశాము. ప్రతి వారం తనకోసం వస్తున్నందుకు సంతోషం కమలమ్మగారికి, మా అమ్మలాంటి కమలమ్మగారిని ఆమాత్రం సంతోష పరుస్తున్నాననే తృప్తి నాలోను వుండేవి. క్రొత్తలో ఆవిడ నాతో కూడా చదివేవారు. సంవత్సరం నుంచి కళ్ళు సరిగా కనిపించక పోవడంతో, కమలమ్మగారు చదవడం లేదు సరికదా క్రమంగా మాటలు కూడా తగ్గించేశారు. మాట్లాడిన కాసేపు మనసులోని గుబులు, బాధ కొంతవరకు చెప్పేవారు. రోజులు గడపడమేలాగ? ఒకరిమీద ఆధార పడడం అలవాటు లేని మనిషి తను. పదిమందికి ఇట్టే వండి పెట్టగలిగే సత్తువ, నాలుగు భాషలు క్షుణ్ణంగా(తెలుగు, తమిళం, హింది, ఇంగ్లీష్) మాట్లాడే నేర్పరి తను, ధైర్యంగా గొంతెత్తి పదిమంది ముందూ పాడమనగానే పాడడం. ఇవే కాక, హైస్కూల్ చదువుతో ఆపేసినా పట్టుదలగా ఇంగ్లీష్ నేర్చుకోవడమేకాదు, ఆడవాళ్ళకి ఎక్కువ అవకాశాలు లేని తన చిన్నతనంలో చెస్స్, బ్రిడ్జ్, కుట్లూ, అల్లికల్లాంటి చేతి పనులు ఎన్నో నేర్చుకున్నారు. అలసట, బద్ధకం తెలీని మనిషి. పక్షవాతం వచ్చిన భర్తకు ఆఖరి ఊపిరి వరకూ సేవ చేశారు. ఇల్లాంటి మనిషి చివరకి కంటి చూపుకి దూరమై, తనకే హాని కలిగించుకునే పరిస్థితి కొచ్చారంటే ఆవిడకి, కుటుంబానికి, చూస్తున్న మాకు బాధే. చూస్తుండగానే ఆరోజు రానేవచ్చింది. కమలమ్మగారు వృద్ధాశ్రమం (నర్సింగ్ హోమ్) కి వెళ్ళేరోజు. ఆముందు


**AAA CHECKER**



**Airport taxi & Limo Service**

**☎ CALL (732) 486-5161; (732) 689-0161**

**WWW.AAACHECKER.COM**
**aaachecker@gmail.com**

**Pickup / drop-off to EWR, JFK and LaGuardia**

**(Telugu speaking drivers available - 10 % discount for TFAS members)**

రోజున నేను వెళ్తే కమలమ్మగారికి చాలా ప్రశ్నలున్నాయి కానీ నాకు చెప్పడానికి జవాబులు లేవు. కమలమ్మగారు ఆరోజన్నది మాత్రం నా మనసులో హత్తుకుంది. “నా జీవిత నాటకంలో ఇదో ఘట్టం. చూద్దాం ఎలా ముగుస్తుందో” అన్న ఆవిడని చూస్తుంటే జాలి వేసింది. ఆ రాత్రి నాకు నిద్ర పట్టలేదు.

కమలమ్మగారు వృద్ధాశ్రమానికి వెళ్ళాక, రోజులు వారాలుగా, వారాలు నెలలుగా మారి, కమలమ్మగారితో ఫోనులో మాట్లాడుతూ, అప్పుడప్పుడు వెళ్లి కబుర్లు చెప్పుతుంటే ఆవిడ కొంత కాలానికి అక్కడి వాతావరణానికి అలవాటు పడుతున్నారనే ధైర్యం వచ్చింది. కొడుకు, కోడలు, మనవలు కూడా తరచూ వచ్చి పోతూండడం, మిగత బంధుమిత్రులు వెళ్లి చూడడంతో కమలమ్మ గారిలో క్రమేణా కొంత విచారం తగ్గిందేమో ననిపించింది. అక్కడున్న సదుపాయాలకి అలవాటు పడి, పరిచర్యలు చేసేవారితోను, మిగత వృద్ధాశ్రమ వాస్తవ్యులతోను కలివిడిగా మాట్లాడడం కొంత మార్పుగానే  కనిపించింది. తనకు తానుగా పాటలు పాడుతున్నారని తెలిసింది. అన్నింటికన్నా తెలుగు తప్ప రాని తోటి స్త్రీ, సీతమ్మగారికి తెలుగు, హిందీ, ఇంగ్లీష్ వచ్చిన కమలమ్మగారు “మిగతావారికి అర్ధమయ్యేలాగ అనువాదం చేసున్నానని” గర్వంగా నాతో అన్నప్పుడు, నాకు అనిపించింది, చూపు లేకుండా చేసిన ఆ భగవంతుడే తనకు ఈవిధంగా మరొకరికి సహాయం చెయ్యమని దారి చూపించి, కమలమ్మగారిలో మార్పు తెచ్చాడని. అందుకేననుకుంటా ఆరోజు రాత్రి నాకు తృప్తిగా నిద్ర పట్టింది.

మన ప్రాచీన సంప్రదాయం ప్రకారం, పెద్దవాళ్ళు వయస్సు పెరిగినకొద్దీ, మానసికంగా, శారీరకంగా, ఆరోగ్యం బాగుండక, డబ్బుఖర్చుల వ్యయ ప్రయాసలకి తట్టుకోలేని పరిస్థితులలో చివరి శ్వాశవరకు తమ కొడుకుల ఇళ్ళల్లో గడపడం విన్నాం. ఇప్పటికీ కొన్ని కుటుంబాలలో ఈ పద్ధతి వుంది. పెద్ద కుటుంబాలలో కొడుకుల దగ్గర కుదరకపోయినా, కొందరు కూతుర్ల దగ్గరుండడం విన్నాము. అయితే, కాలక్రమేణా కుటుంబాలు చిన్నవయి, పిల్లలు దగ్గరలేకనో, వున్నా, వారి ఉద్యోగరీత్యా కుదరకనో, మరో కారణాలవల్లనో, తల్లితండ్రులని వృద్ధాశ్రమానికి పంపడం అవసరమవుతోంది. ఈరోజుల్లో అమెరికాలోనే కాక, మన దేశంలో కూడా ఇల్లాంటి మార్పులు వచ్చాయి. ఇదంతా మనందరకీ తెలిసిన విషయమే. కమలమ్మగారి లాంటి స్త్రీలే కాదు, పురుషులు కూడా ఎంతోమంది వృద్ధాశ్రమాలలో చేరుతున్నారన్నది వింటూనే ఉన్నాం. అమెరికాలో వివిధ ప్రాంతాల్లో మన దేశ సంప్రదాయం, సంస్కృతి, భోజనం, వాతావరణానికి దగ్గరగా వుండే వసతులతో వృద్ధాశ్రమాలు, నర్సింగ్-హోమ్స్ చాలా వెలిశాయి. క్రొత్తవి వస్తు


# Simhadri M Gupta MD

**Board Certified in Neurology since 1998**

**Trained at Mt Sinai Hospital, NY city**
**Subspecialty Neuromuscular disease**

Office Locations

2 Lincoln Highway, Suite 302
Edison, NJ 08820

81 Veronica Avenue, suite 201
Somerset, NJ

Telephone: 732-548-1770; 732-548-1778 Fax 732 548-1772

Languages: English, Telugu, Gujarati, Hindi, Kannada and other translations

న్నాయి. తల్లి తండ్రుల క్షేమం కోరి వృద్ధాశ్రమానికి పంపుతున్న పిల్లలు తాము తప్పు చేస్తున్నామన్న భావము తెచ్చుకోవడం సహజం. పెద్దతనంలో తల్లితండ్రులకు శారీరికంగా, మానసికంగా వచ్చిన మార్పులు, గడ్డు సమస్యలను స్వగృహంలోనే వుంచుకొని సరైన జాగ్రత్తలు తీసుకో లేనప్పుడు, వృద్ధాశ్రమానికి పంపడం ఉచితమైన నిర్ణయమే కాదు అవసరం కూడా. ఇల్లాంటి మార్పు తమ తల్లితండ్రులకి మానసికంగా ఏవిధమైన ప్రభావం చూపు తుందో అని పిల్లలు జాగ్రత్తగా అలోచించాలి. అలవాటైన పరి సరాలు, బంధుమిత్రులని వదలి పెద్దవయస్సులో ఈ క్రొత్త మలు పులో, క్రొత్త ఇల్లు, పరిసరాలు, ఆచారవ్యవహారాలు, క్రొత్త మనుష్యులు వున్న మరొక చోటకు మారడం మానసికంగా ఆ తల్లితండ్రులకెంత అస్వస్థతో గుర్తించాలి. సమయనుకూలమైన చర్చలతో ఈ విషయంలో సరైన నిర్ణయం తీసుకో గలుగుతారు.

తల్లితండ్రులు కూడా తమ పనులు, తమ జాగ్రత్తలు తీసుకో లేని పరిస్థితులలో తమకు తామే హాని కలిగించుకునే సమయం ఆసన్నమయినప్పుడు వృద్ధాశ్రమానికి మారడం సమాయోచితమే అని తెలుసుకోవాలి. క్రొత్త వాతావరణం లోను, క్రొత్త మనుష్యుల మధ్య క్రొత్త జీవితంలోను, వస్తున్న మార్పులని అర్థంచేసు కోవడమే కాదు, మనఃస్ఫూర్తిగా ఆచరించడానికి ప్రయత్నిస్తా మనడంతో, పిల్లలకి కొంత ఉపశమనం వస్తుంది. ఎంతవరకు మార్పులకి అలవాటు పడతారో కానీ ఆ మాటలకి పిల్లలు, తాము చేస్తున్న పని తల్లితండ్రుల మంచికోసమే నన్న భావంతో వారి జీవితం గడపగలరు. ఇక పోతే, అల్లాంటి సమయంలో, ఆ కుటుంబాలలో బంధు మిత్రులు, తమ చుట్టూ వున్న సమాజము పరిస్థితిని అర్థం చేసుకుని, వీలయితే చేయూతనివ్వాలి. పిల్లలు తాముగా చేయ లేని సేవ చేసే మనుష్యులు, సదుపాయాలున్న వృద్ధాశ్రమానికి తమ తల్లితండ్రులని పంపారన్న విషయం సంఘం అర్థం చేసుకోవాలి. రానున్న మార్పులను ఎదుర్కోవలసిన పిల్లలను, ఏమి చేయలేని పరిస్థితులు ఎదుర్కొంటున్న తల్లితండ్రులను, "అయ్యో! పాపం" అంటూ పిల్లల తరఫునో లేక తల్లితండ్రుల తరఫునో మాట్లాడుతూ మరిన్ని కలతలు కలిగించక, మధ్యవర్తులుగా మాటలతో, చేతలతో సహాయం చేస్తే అసలైన ఉపకారమవుతుంది. అమెరికాలో నివసిస్తూ, భవిష్యత్తులోకి తొంగి చూస్తున్న మనలాంటి వారికి ఈవిషయం గురించి ఆలోచించ వలసిన బాధ్యత ఎంతైనా ఉన్నది. వీలున్నప్పుడు ఆరోగ్య పరిస్థితులు మార్పుల గురించి మన పిల్లలతో చర్చించడం, వాటికి తగ్గ కొన్ని పరిష్కారాలు ఆలోచించడం కూడా అవసరం.

దానివల్ల కుటుంబంలో అందరకి కొంత మనఃశాంతి కలుగుతుంది. అప్పుడు వృద్ధాప్యంలోని మార్పులు తట్టుకోగల శక్తి, సామర్థ్యము, ధైర్యము కుటుంబంలో అందరిలోను వస్తుందనే నమ్మకం వుంది నాకు.

**కమలమ్మగారి వంటి వయోవృద్ధులందరికి నా ఈవ్యాసం అంకితం.**

## బీదరికపు నిర్మూలనకు అభివృద్ధియే మార్గమా?

డా. గవరసాన సత్యనారాయణ

భారతదేశములో, 2014 సంవత్సరములో, అభివృద్ధి చేస్తామని చెప్పి కొత్తప్రభుత్వము వచ్చింది. భారతదేశములో ఎన్నో ఇబ్బం దులు ఉన్నాయి. అందరికీ పనిలేకపోవటం (నిరుద్యోగం), బీదరికం తాండవించటం, రోగులకు తగిన వైద్యం లభించక పోవటం, శుద్ధిచేసిన నీరు లభించక పోవటం, పరిసరాలు శుభ్రము గా లేకపోవటం, చదువు లేకపోవటం, ఇలా ఎన్నో ఇబ్బందులు ప్రజలను పీడిస్తున్నాయి. అభివృద్ధివలన ఈ ఇబ్బందులు పోతా యా? ఇన్నిసమస్యలు ఉన్నా, బీదరికము పోవాలని ప్రభుత్వము పలు పథకాలను ప్రవేశపెట్టింది. బీదరికము మీద దృష్టి పెడ దాము. బీదరికము అన్న ది ఈనాటి మాట కాదు. వేదకాలము

---

చింటూ బయట ఆటలాడి ఇంటికి వచ్చాడు. వస్తూనే కిచెన్ లో వున్న తల్లిని కేకేసి, అక్కడ్నుంచే – "అమ్మా! నేను బైక్ మీద నుంచి పడి చెయ్యి విరిగితే ఎక్కువ నష్టమా? నా ప్యాంటు చింపుకుంటే ఎక్కువ నష్టమా?" అని అడిగాడు. "బైక్ మీద నుంచి పడితేనే. ఎందుకు?" గారేజీ లోకి వస్తూ అంది అంది అమ్మ . "చూసావా మనకి ఎంత లాభమో", అమాయకంగా చిరిగిన పాంట్ చూపిస్తూ అన్నాడు చింటూ.




**Bayshore Ophthalmology, LLC**



**SUREKHA COLLUR, MD FRCS**
*Board certified Ophthalmologist*
**Fellowship trained in Glaucoma**
NJ Top Docs
New Jersey's Total Healthcare Resource



**MEGGAN C. HEINZ , OD**
*Doctor of Optometry*
**Lic#27OA00597902**
**OM#27OM00040802**

**CATARACT ▪ GLAUCOMA ▪ EYELIDS ▪ PRK ▪ MULTIFOCAL LENS IMPLANTS**
**Femtosecond Laser Assisted Cataract Surgery**

**Visit Our Onsite Optical Shop**
**Evening Hours and Saturdays**
*YOU CAN MAKE APPINTMENTS VIA OUR WEBSITE*
www.bayshoreophthalmology.com

| We Offer CareCredit Low Monthly Payment Plans | *719 North Beers Street • Holmdel* **732 264 6464** | Like us on Facebook |
| --- | --- | --- |

నుండి బీదరికము ఉన్నది. ఋగ్వేదములో పలు చోట్ల బీదరికపు ప్రసక్తి ఉంది. మతము పేరుతో బీదవారుగా ఉండేవారు ఉన్నారు. హిందువుల సమాజములో నాలుగు వర్ణాలుతో పాటు పంచములు (దళితులు) ఉన్నారు. ఇప్పటికీ ఈ కుల వ్యవస్థ సజీవముగా ఉంది. ప్రజాసూత్రాల ప్రకారము ప్రభుత్వము ఏర్పడినపుడు, అధిక సంఖ్యాకులైన కులస్తులకు పరిపాలన అధికారము చేతికి చిక్కుతోంది. భారతదేశమునకు బ్రిటిషురాజుల పాలన 1947లో పోయింది. ప్రజాస్వామ్యము ఏర్పడింది. బీద ప్రజలను బీదరికము నుండి తప్పించాలని, ఆనాటి నుండి ప్రభుత్వాలు కృషిచేస్తున్నాయి. ఆకృషివల్లన బీదలు తగ్గారు కాని పూర్తిగా బీదరికము పోలేదు. నేను చూసిన విషయాలను ప్రస్తావిస్తాను. నా చిన్నప్పుడు, ఏడవ తరగతి చదువుతున్నపుడు (1947లో), గొల్లప్రోలు ఊరిలో సంతర్పణ చేసినపుడు వలంటీర్ గా పని చేసాను. ఊరి బయట ఉన్న ఒక రైసు మిల్లులో సంతర్పణ పెట్టారు. కులాల వారిగా భోజనములు పెట్టారు. దళితులకు (మాల వారికి, మాదిగలకు) కలపి భోజనమును పెట్టారు. ఒక మాదిగ చర్రున 'నేను మాల వాడి ప్రక్కన కూర్చోనూ' అని లేచిపోయాడు. సుమారు రెండు వందల మంది దళితులు సంతర్పణకు వచ్చారు. అమెరికా నుండి వచ్చిన తరువాత, 1975 సంవత్సరములో, గొల్లప్రోలులో ప్రాక్టీసు చేస్తున్నపుడు, లయన్సు క్లబ్బు ప్రోత్సాహముతో, బీదప్రజలకు సంతర్పణ ఏర్పాటు చేసాము. ఆశ్చర్యము! దళితులు రాలేదుగదా, పట్టుమని పదిమంది భిక్షకులు వచ్చారు. బీదరికము తగ్గింది అనటానికి ఇది నిదర్శనం కావచ్చు. మరోసారి 2006వ సంవత్సరం అనుకుంటాను, గొల్లప్రోలు (స్వగ్రామము) వెళ్ళినపుడు, మా దగ్గిర పనిచేసిన ధర్మయ్య-మేరీల కుమార్తె పెళ్ళికి పిలిస్తే, వారి ఇంటికి శ్రీమతి, నేను కలసి వెళ్ళాము. వారిద్దరు దళితులు. వారి ఇంట్లో పెళ్లి భోజనానికి వెళ్ళాము. ఘుమఘుమలతో వేడిగా ఉన్న కోడిపులావు, కోడి కూరలను వడ్డించారు. తింటూ 'ఈకూరలు చాల బాగున్నాయి, ఎలా చేయించారు?' అని అడిగాను. దానికి సమాధానం: 'డబ్బిచ్చి కాపులను పనివాళ్ళగా పెట్టి వండించాము.' గతములో దళితులు కాపుల పొలాలలో పనిచెసేవారు, ఈనాడు దళితుల ఇళ్ళళ్ళో కాపులు వంటవారుగా పనిచేస్తున్నారు. బీదరికము తగ్గింది అనటానికి మరొక నిదర్శనము. ప్లానింగు కమిషను పోయి, ఇపుడు నీతి ఆయోగ్ వచ్చింది. నీతి ఆయోగ్ వల్లన బీదరికము తగ్గుతుందా? ప్లానింగు కమిషను మొదటిరోజుల్లో నిపుణులు చెప్పిందే వేదం అని బీదరికపు నిర్మూలనకు కార్యక్రమాలు రూపొందించారు. అవీ పనిచేయకపోతే 'గరిబి హటావో' అనే నినాదంతో బీదరికమును పోగొట్టాలని ప్రయత్నించారు. బీదరికము అన్నదానికి సరి అయిన నిర్వచనములేదు. గతము




లో భారతప్రభుత్వము 2400 కేలరీల కన్న తక్కువ ఆహారము తీసుకున్నవారిని బీదవారిగా గుర్తించారు. (అయితే ఈ రోజుల్లో బరువు, ఊబకాయం తగ్గటానికి డబ్బున్న వాళ్ళు కూడా ఇంతకన్న తక్కువ కేలరీల భోజనం చేస్తున్నారు.) వరల్డు బేంకు వారు రోజుకి $1.25 (అంటే రోజుకి 75 రూపాయలు) కన్నతక్కువ ఆదాయము ఉన్నవారు బీదవారుగా గుర్తించారు. వరల్డు బేంకు వారి లెక్కల ప్రకారం ప్రపంచములో 87.23 కోట్లు ఉంటే భారతదేశములో 17.9 కోట్ల బీదలు ఉన్నారు.

ధనికదేశమైన అమెరికాలో బీదవారు లేరా? నాలుగు కోట్ల 65 లక్షల మంది బీదవారు అమెరికాలో ఉన్నారని, అంటే వందమంది జనాభలో నూటికి 15 బీదలు ఉన్నారని చెప్పవచ్చును. ఇటీవల చైనాదేశము ప్రపంచములోనే ధనిక దేశముగా పరిగణినింప వచ్చునని నిపుణుల అభిప్రాయము. గేలప్ పోల్ ప్రకారం చైనాలో, 2012 సంవత్సరములో, నూటికి 27 మంది బీదవారుగా తేలింది. బ్రెజిల్, రషియా, ఇండియా, చైనా దేశాల అభివృద్ధి వల్లన ప్రపంచ దేశాల జిడిపి (GDP)అనే సూచిక మెరుగుపడింది. ఈ దేశాలలో బీదరికము లేదా? బ్రెజిల్ దేశములో నూటికి 21.4 శాతము, రషియాలో నూటికి 13 శాతము (కోటి ఎనభై లక్షల మంది), భారత దేశములో నూటికి 38.2 శాతము, బీదలు ఉన్నారని తేలింది. లెక్కలు కట్టిన సంస్థలు వేరు అవటము వల్లన అంకెలలో కొంచం హెచ్చు తగ్గులు కనిపిస్తాయి. ఏది ఏమైనా, బీదవారు అన్నిదేశాలలోను ఉన్నారు. నేడు బీదలుగా ఉన్నవారు రేపు ఉన్నవారుగా (ధనికులుగా) కనిపిస్తారు. నేడు ధనికులుగా ఉన్న వారు బీదలుగా తయారౌతున్నారు. కారణమేమిటి? డ్యూక్ (అమెరికా) విశ్వవిద్యాలయములో అచార్యులుగా ఉన్న అనిరుద్ధ్ కృష్ణన్ గారు మూడు రాష్ట్రాలలో ఉన్న 107 గ్రామాలలో పరిశోధన చేసి, 'కొంతమంది బీదరికపు ఊబిలో చిక్కుకుంటూ ఉంటే, మరి కొందరు బీదరికపు ఊబినుండి బయట పడుతున్నారు' అని చెప్పారు. రోగాలవల్లన, శక్తికి మించిన ఖర్చు చేసి అట్టహాసముగా పెళ్ళిళ్ళు చేయటం, మొదలగు కారణాల వల్లన ధనికులు బీద వారుగా తయారవుతున్నారు. గవర్నమెంటు ఉద్యోగము, వ్యవసాయము చేయుటకు తగిన నీరు లభ్యమవటము, అదాయాన్ని పెంచే వృత్తులను చేపట్టటము వల్లన కొంతమంది బీదరికము నుండి బయట పడగలుగుతున్నారు. బీదరికము పోవాలంటే పలు కార్యక్రమాలు ప్రభుత్వము చేపట్టవలసి ఉంటుంది. ప్రతి జిల్లాలోను బీదరకపు నిర్మూలన కార్యక్రమము తయారుచెయ్యాలి. కార్యక్రమము తయారు చేసే ముందు ఆయా జిల్లా కాలేజీల్లో చదువుతున్న విద్యార్ధులచే బీదరికముపై పరిశోధనా పత్రాలు తయారు



చేయించాలి. ఆకార్యక్రమముల వల్లన ఎంతవరకు బీదరికపు నిర్మూలన జరిగిందో ఐదు సంవత్సరాలకు ఒకసారి అంచనా వెయ్యాలి. మొన్నటివరకు ప్లాన్నింగ్ కమిషను వారు దేశము మొత్తానికి వర్తించే పధకాలను చేపట్టారు. ఇపుడు నీతి అయోగ్ వచ్చింది. బీదరికపు నిర్మూలను నీతి అయోగ్ వారు జిల్లా ప్రాతి పదికగా తీసుకుని బీదరికపు నిర్మూలనకు కృషిచెయ్యాలి. తక్కువధరకు బియ్యము వగైరా 'పబ్లికు డిస్ట్రిబ్యూషన్ సిస్టం' ద్వారా సరఫరా చేస్తున్నారు. ఎక్కడైతే  బీదప్రజలకు లబ్ది సమకూరుతుందో అక్కడ రాజకీయ నాయకులు, చౌకధరల డిపోవారు కలసి, తక్కువ ధరకు వచ్చిన వస్తువులను దారిమళ్ళించి, డబ్బు చేసుకుంటున్నారు.  'పబ్లికు డిస్ట్రిబ్యూషన్ సిస్టం' అవినీతిమయం. దీని నుండి తప్పించుటకే, మధ్యవర్తి లేకుండా బీదలకు చేరవలసిన సొమ్మును డైరక్ట్-గా బేంకులో జమచేయటం. బీద వారికి బేంకుల్లో డబ్బు దాచుకొవటం అన్నది కొత్త విషయం. మోదీ పుణ్యమా అని 'ప్రధాన్ మంత్రి ధన్ యోజనా'  ద్వారా బీదలకు బేంకు ఎకౌంటు సంప్రాప్తమైనది. 'ప్రధాన్ మంత్రి ధన్ యోజనా' అన్నది కొత్తవిషయము కాదు. అమెరికా అధ్యక్షుడు లింకను గారు 'ఫ్రీడ్ మెన్ బ్యూరొ ఆక్ట్ ఆఫ్ 1865' ద్వారా స్వతంత్రులైన నల్లవారికి బేంకు సదుపాయము కల్పించాడు. ఇది కార్యరూపము దాల్చక ముందే హతమయ్యాడు. ప్రభుత్వము చేస్తున్న పని ప్రజలకు తెలియచేయాలి.  ప్రజల మనుసులలో మార్పు రావాలి. అందరికీ పని కల్పించాలి. అందరకూ చదవటం, రాయటం రావాలి. అందరు ఆరోగ్యముగా ఉండాలి. అవినీతిని అంతమొందించాలి.

అపుడే అభివృద్ధితో బీదరికమును నిర్మూలించవచ్చు.

References:


1. Why Growth Matters: How economic growth in India reduced poverty and the lessons for other developing countries. Jagadish Bhagwati and Arvind Panagariya. PublicAffairs, New York, 2013.
2. Poverty in India. http://en.wikipedia.org/wiki/Poverty. Accessed on Jan 10, 2015.
3. Class and Religion in Ancient India. Jayantanuja Bandyopadhyaya. Anthem Press, 2007
4. The Rig Veda. Ralph T.H. Griffith, Translator [1896]. http://www.sacred-texts.com/hin/rigveda/ Accessed on Jan 10,2015.
5. Causes of Poverty in India. Traditions of Discrimination & Exclusion. http://www.poverties.org/causes-of-poverty-in-india.html Accessed on Jan 10, 2015.
6. ANIRUDH KRISHNA, Duke University, Durham, NC, USA http://www2.sanford.duke.edu/krishna/appaper.pdf Accessed on Jan 10, 2015.
7. http://www.indexmundi.com/facts/india/gdp-per-capita (Income in India in 1975= $160.53 and in 2011=$1,508.54)
8. Maddison A (2007), Contours of the World Economy I-2030AD, Oxford University Press, ISBN 978-0199227204. Av income of an Indian in 1947=$600.00 ($1= Rs.1)
9. The Tyranny of Experts - Economists, Dictators, and the forgotten rights of the Poor. William Easterly. Basic Books, New York, 2013.
10. John Burn-Murdoch and Steve Bernard, The Fragile Middle: millions face poverty as emerging economies slow, The Financial Times (13 April 2014)
11. Poverty Reduction Strategy Papers (PRSP). Last updated: Wednesday, January 14, 2015. http://www.imf.org/external/np/prsp/prsp.aspx
12. http://www.povertyusa.org/the-state-of-poverty/poverty-facts/
13. http://en.wikipedia.org/wiki/Poverty_in_China/
14. http://www.indexmundi.com/brazil/population_below_poverty_line.html
15. http://www.forbes.com/sites/kenrapoza/2012/04/12/disturbing-trend-for-putin-russian-poverty-rising/
16. http://www.nytimes.com/2014/07/10/world/asia/setting-a-high-bar-for-poverty-in-india.html
17. How the Poor can save Capitalism. John Hope Bryant. Berret-Koehler Publishers, Inc. 2014



Matrimonial

Female 23 years, 5'8", B.Tech,. Civil, Senior Engineer, Hyderabad Metro Project, L&T. Future Plan - M.B.A/M.S in USA. Gotram – Lohitasya, Interests - Painting and Movies. Contact - apdm65@gmail.com

## తెలుగు సాహిత్యంలో స్త్రీ పాత్రలు   నాడు – నేడు

డా. ముక్తేవి భారతి, హైదరాబాదు (ఇండియా)

(గత సంచిక తరువాయి) మన సాహిత్యంలో ప్రబంధయుగంలోనే కాదు, సాహిత్య యుగాలన్నిటిలోను స్త్రీల పాత్రలలో ఏదో ఒక ప్రత్యేకతను కవులు చూపించారు. దక్షిణాంధ్ర యుగంలో, మధుర వాణి, రంగాజమ్మలు గొప్ప కవయిత్రులు, విదూషీమణులు. సంగీత సాహిత్య విద్యలలో ఆరితేరినవారు. కనకాభిషేక గౌరవాలు పొందినవారు. వారు సృష్టించిన స్త్రీ పాత్రలలో పాత్రోచిత భాష వాడి న యక్షగానాలలో స్త్రీలు , నాయిక పాత్రలలో స్త్రీలు ఒక ప్రత్యేక స్థానాన్ని పొందారు. ఆధునిక సాహిత్యంలో స్త్రీ పాత్రల సృష్టిలో ఒక విశేషం గమనించాలి. పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో వచ్చిన రచ నల్లో స్త్రీ పాత్రల్లో ఒక విభిన్నత కనిపిస్తుంది. భావకవితా యుగం లో స్త్రీ పాత్రలను శృంగార నాయికలుగా కన్న మనస్వినులుగా కవులు సృష్టించారు. ఊహాప్రేయసుల పాత్రలకు ఒక స్థానం కలిగింది. కృష్ణశాస్త్రి గారి 'ఊర్వశి' సృష్టిలో ఒక విలక్షణత వుంది. జానపద నాయిక నండూరి సుబ్బారావు గారి 'ఎంకి' పాత్ర ఎప్పటికీ ముగ్ధ మనోహరమే. ఎంకి గొప్ప ఇల్లాలు. గొప్ప ప్రేయసి.

'ఎంకెవ్వరని లోక మెపుడైన అడిగితే
వెలుగు నీడల వైపు వేలు సూపిస్తు '
'ఎంకి వంటి పిల్ల లేదోయ్ లేదోయ్ '
'ఎనక జన్మలోన ఎవరమో అంటే
సిగ్గొచ్చి నవ్వింది సిలకనా ఎంకి '

ఎంకి పాత్రను నండూరి సుబ్బారావు గారు 'గుండె గొంతుకలోన కొట్లాడుతాది. కూకుండ నీదురా కూసింత సేపు' – సరిగంగ స్నానాలూ చేస్తుంది ఎంకి. నాయుడు బావతో భద్రాద్రికి పిల్లాడిని చంకనేసుకుని వెడుతుంది. తెలుగ సాహిత్యంలో గొప్ప పాత్ర ఎంకి. తెలుగు సాహిత్యం అంటే, గురజాడ అడుగుజాడని తల్చు కోవలిసిందే. కన్యాశుల్కం నాటకం ఎన్ని విధాల గొప్పదో చెప్పక్క ర్లేదు. కన్యాశుల్కం నాటకం అనగానే మధురవాణి, గిరీశం , బుచ్చమ్మ, అగ్నిహోత్రావధానులు, రామప్పపంతులు – ఇలా చూస్తాం. కానీ, మరుగు పడిన పాత్ర, నాటకగమనానికి మూల మైన పాత్ర, అగ్నిహోత్రావధాని భార్య. కూరలు తరుక్కుంటూ కూర్చునే ఇల్లాలు వెంకమ్మ అంటే ఆశ్చర్యంగా వున్నా, వాస్తవ మని నేను నమ్ముతాను. వెంకటేశానికి ఇంగ్లీషు చదువు చెప్పించనని తండ్రి అంటే 'నే చెప్పిస్తా'నని ఎలా అనగలిగింది వెంకమ్మ ఏ ధైర్యంతో అంది? – పుట్టింటివారు పసుపు కుంకాల కిచ్చిన భూమి తనది. దానిపై హక్కు తనదని, అది అమ్మి పిల్లాడికి చదువు చెప్పిస్తానన్న వెంకమ్మ కన్న ధైర్యమున్న తల్లులున్నారా? ఆర్థిక బలం ఎంత గొప్పదో ఆ పాత్ర ద్వారా చెప్పించారు గురజాడ. ఆ నాటకంలో అంతర్నాటకం నడిపించింది కూడా వెంకమ్మ పాత్రే. మన సాహిత్యంలో నవలా ప్రక్రియకి ఒక ప్రత్యేక స్థానముంది. ఒక కాలంలో నవలామణులు నవలలు విస్తృతంగా రచించారు. ఇల్లిందల సరస్వతీదేవి , సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత (స్వర్ణకమలాలు) రచించిన 'నీ బాంచను కాల్మొక్త' అనే నవల చాలా విశిష్టమైంది. ఒక సామాన్య గృహిణి , భర్త మరణించా క, ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ కూడా తుఫాను బాధితుల్ని ఆదుకుంది. ఎలా? రాచ్చిప్పలో పులుసు, చాపలపై అన్నం గుండి గలోది ఆరపోసింది. పులుసు,


**Mandaps by Dhoom**

**Contact**

*By Appointments Only*
**Office/Showroom Location:**
56 Ethel Rd. W., Suite #17
Piscataway, NJ 08854

*Ask for*
*Raj or Renuka*
*Phone: (732) 887-3231*
*Email: dhoom4all@gmail.com*

అన్నం ముద్దలు చేసి ఆకలితో వచ్చి నిల్చున్న అందరి బొచ్చెలలో ముద్దలు చేసి పెట్టింది. 'నీ బాంచను కాల్మొక్త' - ఓ పిల్లాడు, గోచీతో, ఎర్రని జుట్టుతో ఆ పెద్దమ్మ దగ్గర నిలుచున్నాడు. 'పోరా, కాశిగా" తరిమేస్తున్నా రంతా, కానీ ఆమె ఆదళిత బాలుణ్ణి చేరదీసింది. ఆ కాశిగాడిని పెంచింది. చదివించి డాక్టరుని చేసింది. డాక్టరుని ఇచ్చి పెళ్లి చే సింది. కాశిగాడు డా. కాశీరాం అయ్యాడు. ఈ నవలలో ఆ స్త్రీ మూర్తి లాటి పాత్రను ఆనాడే ఇల్లిందల సరస్వతీ దేవి గారు ఎలా సృష్టించారో ఆశ్చర్యమే. మానవత్వానికి ప్రతీక ఆ స్త్రీ పాత్ర. కథా సాహిత్యం మనకి చాలా ఉంది. ఇప్పుడు వినిపిస్తున్న వాదాలన్నీ కథల్లో అంతర్భాగమయ్యాయి. మొత్తం సమాజంలో ఎన్నోమార్పులోస్తున్నాయి. ప్రపంచీకరణ, పారిశ్రామికీకరణ, పట్టణీ కరణ మొదలైన వాని ప్రభావం కధారచనకు దోహదం చేస్తోంది. దళిత వాదం, స్త్రీవాదం,మైనారిటీ వాదం – ఇలా ఎన్నెన్నో అంశాలు ఆధునిక కధాసాహిత్యంలో చోటు చేసుకుంటున్నాయి. భావజాలంలో ఆలోచనాధోరణులలో కొత్తదారులు కనిపిస్తున్నాయి. స్త్రీ వాద రచయిత్రిగా ఓల్గా రచనలు సామాజిక వ్యవస్థకు అద్దం పట్టాయి. ఆ రచనల్లో స్త్రీ పాత్రలు మనల్ని ఆలోచింపజేస్తాయి. స్వేచ్ఛ గురించి ఒక పాత్ర అనుకుంటుంది. ఆ అమ్మాయి ఇంట్లో మేనత్త వుంది. అలా నడవకు, ఇలా నవ్వకు అని ఆంక్షలు పెడు తుంది. ఆ ఇంట్లో తల్లిని ఏడడిగినా, మీ నాన్న నడుగు అనటం, స్నేహితురాలితో సినిమాకి వెళ్ళవద్దనడం – అబ్బ , ఇంట్లో దేనికీ స్వేచ్ఛ లేదు, పెళ్ళిలో స్వేచ్ఛ ఉంటుందనుకుని ప్రేమించి పెళ్లి చేసుకుంది. అందులో స్వేచ్ఛ ఉందా? కాలేజిలో స్ట్రైక్ లో పాల్గొం ది ఆ అమ్మాయి. 'ప్రతివాడు నీ భార్య ఫోటో పేపర్లో చూసా నంటున్నాడు "ఇక అవి ఆపేయ్' – భర్త గొంతు. 'పత్రికకి చందా కట్టక్కరలేదు' – భర్త గొంతు. ఇలా చూస్తే ఏది స్వేచ్ఛ? ఎక్కడుంది? స్నేహితు రాలు ఒక వ్యకతితో సహజీవనం చేస్తుంటుంది. ఈ సంబంధంలో ఎవరిపైన ఎవరి అధికారాలు, పెత్తనాలు వుండవు. ఎవరి స్వేచ్ఛ వారిది. ఓ నా స్వేచ్ఛ నువ్వెక్కడ? ఆ అమ్మాయి చివరికి కుటుంబం వదలి వచ్చేసేక, స్వేచ్ఛ ఒకరిచ్చేది, ఒకరు తీసుకునేది కాదు, అయినా అందరినీ ఇటు తిప్పటం కాదు నేను అనుకుంటున్న ది, కొందరయినా స్వేచ్ఛ గురించి అర్ధంచేసుకుంటే చాలు. – ఈ కథలో స్త్రీ పాత్రలో ఒక చైతన్యం, ఒక ముందడుగు చూస్తుంటే, ఆ స్త్రీ పాత్రని అర్ధం చేసుకోవాలనే అనిపిస్తుంది.మన సాహిత్యంలో కొత్త ధోరణులు చాలా వస్తున్నాయి. వాటిలో స్త్రీ పాత్రల ప్రాధాన్యత ఎక్కువగా గోచరిస్తోంది. మారుతున్న సమాజంతో పాటు స్త్రీ పాత్ర చిత్రణలో రచయితలు ప్రత్యేకత కనబర చటం ఆహ్వానింపదగిన అంశం. ముందే చెప్పాను కదా మన సాహిత్యంలో స్త్రీ పాత్రలను గురించి చెప్పటం "అమలిన తారకా సముదయంబుల"ను ఎన్నటం మంత కష్టమే. అయినా మన సాహిత్యంలో స్త్రీ పాత్రలను అర్ధం చేసుకోవటం చాలా అవసరం.






**అందరూ ఒకేలా ఉండరు**

శ్రీమతి ప్రమీల చిన్నమ్మగారి

ఫోన్ రింగ్ అయింది."హల్లో సాగర్ మాట్లాడుతున్నాను" అనగానే అవతలినుంది "నేను రాహుల్ ఫాదర్ రాజారామ్ మాట్లాడుతున్నాను అబ్బాయి అమెరికా నుండి వచ్చాడు రేపు సరిగ్గా పది గంటలకు సారికను  చూసుకునెందుకు వస్తున్నాము" ఇన్ఫర్మేషన్ ఇచ్చాడు రాజారామ్. "అలాగే మేము వెయిట్ చేస్తాము"చెప్పాడు సారిక ఫాదర్ సాగర్ ఫోన్ పెట్టేస్తూ భార్యను కేకేసాడు "సమంతా రేపు పది గంటలకు రాహుల్ వాళ్ళు వస్తున్నారు ఇంట్లోకి ఏమైనా కావాలా?" రమణి కూడా హుషారుగా "ఎమి అవసరము లేదు. అన్నివున్నాయి . ముందుగా అనుకున్నదేగా అన్ని ప్రిపేర్ చేసుకున్నా" అని విషయం సారికకు చేప్పింది. సాగర్ సమంతలకు ఒక అబ్బాయి ఒకమ్మాయి. అబ్బాయి ఎం.ఎస్. చేసి యు.ఎస్. లోఉద్యోగం చేస్తున్నాడు,అమ్మాయి సారిక బి.టెక్. చేసి ఎం.ఎస్. చేసేందుకు స్టేట్స్ వెళతానంటే " సాగర్ సమంత ఒప్పుకోలేదు. పెళ్లి చేసిపంపితే అక్కడి మిగతా విషయాలు అల్లుడు చూసుకుంటాడు అని సారిక ఎంత గోల పెట్టినా వాళ్ళు వినలేదు. స్టూడెంటుగా పంపితే అమ్మాయి ఏమికష్టపడుతుందో అని వారి భయము. సారిక అన్న సందీప్ కూడా అమ్మ నాన్నలకు వంత పాడాడు.ఇక సారిక చేసేది ఏమిలేక మౌనంగా ఉండిపోఇంది. సాగర్ ఫ్యామిలీకి మంచిపేరు ఉంది. సారిక చాలా అందంగా వుంటుంది.సాగర్ ఫ్యామిలీ తెలిసినకొందరు సారికను చేసుకునేందుకు ఇష్టపడినా, సాగర్-కు కొన్నివిషయాలు నచ్చలేదు, మరికొందరు సాగర్-ని  అడిగేందుకే వెనుకాడారు. ఎలాగైతేనేమి ఇప్పుడు రాజారామ్ వాళ్ళ సంబంధంఅందరికినచ్చింది. రాజారాంకు ఇద్దరుఅబ్బాయిలు, ఒకఅమ్మాయి. అబ్బాయికి, ఒక అమ్మా యికి మ్యారేజ్ అయింది. రాహుల్ చిన్నవాడు. ఎం.ఎస్. చేసి యు.ఎస్.లో మంచిజాబ్ చేస్తున్నాడు..అంతా బాగా చదువుకున్న ఫ్యామిలీ.  అబ్బాయి తండ్రి రాజారామ్ తల్లి రమణి. రమణి, రాజారామ్, కూతురు, కోడలు, రమణి చెల్లెలు అందరు వచ్చి సారికను చూసీ వెళ్ళారు. సాగర్ రాజారామ్ తో, సమంత రమణి తో "సారిక కు పది లక్షలు పెడదామనుకున్నాము ,పది లక్షలలో గోల్డ్, చీరలు, పెళ్లి ఖర్చులు అన్నీ అందులోనే.  గోల్డ్ , చీరలు తక్కువపెట్టి పెళ్ళి సింపుల్ గా లేదా రిజిస్టర్ మ్యారేజ్ చేసి కాష్

ఎక్కువ ఇవ్వమన్నా ఇస్తాము, కానీ అంత కంటే ఏమి ఎక్కువ ఇవ్వము" అని క్లియర్ గా చెప్పారు. అందుకు రాజారామ్ ఫ్యామిలీ సంతోషపడి అమ్మాయి ఫోటో తీసుకొని రాహుల్ ఫోటో ఇచ్చి వెళ్లారు. రెండు రోజుల తరువాత "సారిక ఫోటో రాహుల్ కు పంపాము, రాహుల్ కు అమ్మాయి ఫోటో నచ్చింది మాకు అందరికి సారిక నచ్చింది. మా అబ్బాయి సారిక సంబంధమే చూడండి అని వేరే ఎవరిని చూడకండి అని చెప్పినాడు. ఇలా ఎందుకు చెబుతున్నాము అంటే అబ్బాయి త్వరలోనే వస్తున్నాడు, మూడు వారాలు మాత్రమే వుంటాడు. పెళ్లి పది రోజుల్లో చెయ్యాలి. మీరుకూడా అంత తొందరలో పెళ్లి అంటే హడావిడి అవుతుంది అని ముందే చెబుతున్నాము, మీరు పెళ్లి ప్రయత్నము లో ఉండండి" అని రాజారామ్ తెలిపాడు. సాగర్ మళ్ళీ ఒకసారి కట్నం గురించి వివరంగా చెప్పాడు. రాజారామ్ "చెప్పారు కదండీ మాకు డబ్బులే ముఖ్యమయితే చాలా సంబంధాలు వస్తున్నవి. కాని మాకూ, రాహుల్ కు సారిక బాగానచ్చింది. పెళ్లి కూడా తొందరగా చేయవలసి వస్తుందని ఇంత క్లియర్ గా చెబుతున్నాము" అని రాజారామ్ నెమ్మదిగా అన్నాడు. "అబ్బాయి కి గ్రీన్ కార్డు వస్తే అమ్మాయిని స్టేట్స్ తీసుకు వెళ్ళడం చాలా లేట్ అవుతుందని, మాకు అమ్మాయి నచ్చిందనీ ఇంత తొందర చేస్తున్నాము."అన్నాడు.సాగర్ విషయమంతా సమంతతో చెప్పి "మిగతా విషయాలు తొందరగా తేమిలేల ఉండమన్నాడు వియ్యంకుడు. ఇప్పుడు ఈ ఫోన్ "అబ్బాయి వచ్చాడు" అని. సరిగ్గా పదిగంటలకు రాహుల్ ఫ్యామిలీ అంతా వచ్చారు. మర్యాదలూ గట్రా అయ్యావి. రాహుల్ సాగర్ తో "సారికతో ఒక పది నిముషాలు మాట్లాడాలి" అని రిక్వెస్ట్ చేశాడు. సాగర్ సారికకు విషయం చెప్పి వాళ్ళు ఇద్దరు మాట్లాడుకునే వీలు కలిపించాడు. ఓ పదిహేను నిముషాలు గడిచాక రాహుల్ హుషారుగా వచ్చాడు. రాజారామ్ మళ్ళీ" అబ్బాయి త్రీ వీక్స్ మాత్రమే వుంటాడు" మేము ఇంటికెళ్ళి ఫోన్ చేస్తాం ముహుర్తాలు ఎప్పుడు పెట్టుకునేది" అన్నాడు. సాగర్ మళ్ళీ తలాడించాడు. రాహుల్" "సీ యు సూన్" అంటూ హ్యాపీగా వెళ్లి పోయాడు. వాళ్ళు వెళ్ళగానే సమాంత సారికతో "రాహుల్" ఏమి మాట్లాడాడు?"అని ఎంక్వయిరీ మొదలు పెట్టింది." సారిక' 'పెద్దగా ఏమి మాట్లాడలేదు, మీకు నేను నచ్చా నా? ఇంత తొందరగా మ్యారేజ్ చేసుకుని అమెరికా రావడం మీకు ఇబ్బంది ఏమిలేదుకాదా? నాకు గ్రీన్ కార్డు వస్తే తరువాత చాలా లేట్ అవుతుంది అని మాట్లాడాడు" అంది. తను ఓ.కే. చెప్పానని చెప్పింది. ఇక ఫోన్ కోసం వెయిటింగ్. కాసేపటికి ఫోన్ " రాహుల్ కి సారిక నచ్చింది. సాయంకాలం ఐదు గంటలకు మంచి ముహూర్తం వుంది, నిశ్చయ తాంబులాలు పుచ్చుకుందాం. మీకు కావలసిన వాళ్ళను పిలుచుకోండి, చాలా సింపుల్ గా చేసుకుందాం" రాహుల్ ఫాదర్ రాజారామ్ చెప్పేడు. సాగర్ "అలాగే " అనగానే "మీకు కావలసిన వాళ్ళను పిలుచుకోండి కాని చాలాసింపుల్-గా చెయ్యాలి. సరిగ్గా ఐదుగంటలకు వచ్చేయండి" అని ఫోన్ పెట్టేశాడు రాజారామ్. సమాంత కంగారు పడిపోయింది. తొందరగా అన్నారు కాని మరీ ఇంత తొందర అనుకోలేదామే. సాగర్ ఎవరిని పిలవాలో సమంతకు చేప్పి సాగర్ ఓ అరగంటలో వస్తానని బయటకెళ్ళాడు. సమాంత, సాగర్ సిస్టర్ "శాంతి" కి, సమంతా అక్క రాగిణి కి ఫోన్ చేసి విషయం చెప్పి తొందరగా బయలుదేరి వచ్చేయమని చెప్పింది. అంత వరకు ఎవరికీ ఏమి చెప్పలేదు. వాళ్ళు సంతోషపడి "ఇప్పుడే బయలుదేరుతున్నాము, నీకు ఏమైనా ఏమయినా సహాయం అవసరం ఉంటుంది కదా", అని ఫోన్ పెట్టేసారు. సమంతా గబగబా అన్ని సర్దుకోవడంలో పడిపోయింది. మళ్ళి ఫోన్ మోగింది. "ఈ హడావుడి లో ఎవరి ఫోన్" అనుకుంటూ ఫోన్ రిసీవ్ చేసుకుంది. "మీరు ఐదు గంటలదాకా వెయిట్ చేయండి అప్పుడు చెపుతాము ఎన్నింటికి రావాలో " అని రాహుల్ అమ్మ రమణి చల్లగా చెప్పింది. సమాంత షాక్ ఐంది. కంగారుగా "ఐదు గంటలకు మంచి ముహూర్తం ఉంది మీవాళ్ళను పిలుచుకోండి. సరిగ్గా ఐదు గంటలకు వచ్చేయండి అని అన్నయ్యగారు చెప్పారు" నసిగింది సమంతా. ఆవిడ కాస్త చిరాగ్గా " నేను చెబుతున్నానుకదండీ. ఐదు గంటలకు చెబుతామని – ఎప్పుడు బయల్దేరాలో" రెట్టించింది రమణి. సమాంతకి చిరాకు, కోపం, కొంచం అనుమానం వచ్చింది. ఇందులో ఎదో మతలబు వుందనిపించింది. "ఐదు గంటలదాకా ఎందుకు? మీరు

ఇప్పుడే వేరే సంబంధం చూసుకోండి. మేము మీ సంబంధం వదులు కుంటున్నాము." అని సీరియస్ గా చెప్పింది. అటువైపు నుండి రాగిణి కంగారు పడిపోయింది. "అది కాదండీ రాహుల్ ను అడిగి చెపుదామని ... " ఆవిడ మాట పూర్తికాక ముందే "ఏమిటమ్మా అడిగేది? రాహుల్ ను అడిగే కదా చెప్పారు? రాహుల్ మా అమ్మాయితో కూడా మాట్లాడాడు కూడా కదా. సారీ. బై." అని ఫోన్ పెట్టేసింది సామంత. సారికకు కూడ వాళ్ళ ధోరణి నచ్చలేదు" మంచి పని చేసావు మమ్మీ" అంది. (ఒక వైపు వాళ్ళుచేసిన పనికిచాలా బాధ అనిపించినా) సాగర్ కు ఫోన్ చేసింది. సాగర్ చాలా అశ్చర్య పోయాడు. "తేరుకొని పోస్లే వాళ్లకు ఎక్కువకట్నం ఇచ్చేవాళ్ళు వేరే ఎవరో దొరికి వుంటారు వుంటారు. మంచిపని చేసావు. ఇలాంటి సంబంధం తప్పి పోవడమే మంచిది" అని సమంత ను ఓదార్చాడు. సారిక తో "ఇటువంటి సంబంధం అయి వుంటే తరువాత చాల బాధ పడవలసివచ్చేది" అని ఓదార్చాడు. సాగర్ సిస్టర్ శాంతి మాత్రం" చాలా మంచిగా వాళ్ళకు బుద్ధి చెప్పావు వదినా" అంది. సమాంత అక్క రాగిణి "నీకు మరీతొందర ఎక్కువే. మరిదిగారు కాబట్టి సరి పోయింది. మీ బావగారయితే నా పని అయిపోయేది. ఈవెనింగ్ దాక వెయిట్ చేస్తే ఏమి? మేము వచ్చినా నీతో కాసేపు మాట్లాడి వెళ్ళేవాళ్ళం కదా?" అంది. "లేదులెండి ఇలాంటి వారే ఒక పెళ్ళిలో పీటలమీద పెళ్ళి కొడుకును కట్నం కొద్దిగా తక్కువ వచ్చింది పెళ్లి అవగానే పెళ్లి పందిరిలోనే మిగతాకట్నం సర్దుతాము అన్నా వినకుండా పీట లమీది పెళ్ళికొడుకును తీసుకెళ్ళిపోతుంటే అమ్మాయి ఫాదర్ ఎలాగో అవస్థ పడి మిగతా డబ్బు సర్ది పెళ్లి చేసాడట. ఇలాంటి వాళ్ళు అక్కడక్కడ ఉంటారు". తరువాత మధ్యవర్తి ద్వారా విషయం తెలిసింది. ఏమంటే - వాళ్లకు ఎవరో రాజారామ్ వద్దకు నలభై లక్షలు ఇస్తామని వచ్చారట. వీళ్ళ ఆడవాళ్ళకు ఆశ పుట్టింది, ఆ సంబంధం చూసాక కుదరకపోతే రాజారాం వాళ్లకు ఓకే చెబుదామని అనుకున్నారట. ఇంతాచేసి పెళ్ళి కొడుక్కి ఆ అమ్మాయి నచ్చ లేదు. తీరా అవతలి పెద్దమనిషి ఒక లక్ష మాత్రమే కాష్ ఇచ్చి మిగతాదిఅంతా పెళ్ళికూతురు పేరుతో బ్యాంకులో డిపోజిట్ పెడతానన్నాడట, నో ఆ సంబంధం పుసికిపోయింది. రాహుల్ కి సారిక బాగా నచ్చడం వల్ల ఈ సంబంధం కాన్సిల్ అవడంతో చాలా బాధపడ్డారని తెలిసింది. తొందరలోనే సారికకు మంచి సంబంధం రావడం, వెంటనే పెళ్లి జరిగి యు.ఎస్. వెళ్ళిపోవడము, జరిగిపోయింది. రాహుల్ కు అప్పటికి ఈ సంబంధం కుదరకున్నా తరువాత వారికి తగిన సంబంధం వాళ్లకు కుదిరే వుంటుంది.


దీన్ని బట్టి తేలేదేమిటంటే మగ పెళ్ళివాళ్లము కాబట్టి అమ్మాయి తరఫు వాళ్ళు తగ్గి ఉండాలి, అన్నిటిలో మేము చెప్పినట్లే జరగాలి అని, అడుగులకు మడుగులొత్తాలి, అణిగి- మణిగి ఉండాలి అనుకోవడం మంచిదికాదు. అలా అయితే అమ్మాయి పెళ్లి అయ్యాక అత్తగారింట్లో సంతోషంగా ఎలా వుండగలదు? అమ్మాయి వాళ్లకు అభిమానం, గౌరవం వగైరా వగైరా ఉంటాయి అని మరచి పోకూడదు'.

"మన ఇంటికి వచ్చే అమ్మాయి మనతో కలిసిపోవాలంటే – ఈ ఇంటికి ఆ ఇల్లు ఎంత దూరమో ఆ ఇంటికి ఈ ఇల్లు అంతే దూరం" ఆని మరచిపోరాదు'.










... YOUR JEWELER FOR EXQUISITE DESIGNS ...
... HALLMARK JEWELLERY ...
... BEST IN QUALITY AND PRICES ...
... EXCELLENT CUSTOMER SERVICE ...
... WE BUY AND EXCHANGE OLD GOLD ...
... WE BUY AND SELL 24K GOLD AND SILVER BARS / COINS ...
Swarna Jewels
Quality, our Tradition
2101 STREET ROAD BENSALEM PA 19020
WWW.SWARNAJEWELS.NET
PH: (215)-633-0708
TIMINGS:
11:30 AM – 7:30 PM
TUESDAY CLOSED
For more details, contact store.

**Telugu Fine Arts Society (TFAS)**
**c/o Vamsi Koppuravuri**
**1 Newburgh Drive, Edison, NJ - 08820**

PRSRT STD
US Postage PAID
Permit #6
New Brunswick, NJ

**Return Service Requested**

*********************************************************************************************


# *Shanthi Travel, Inc.*

194 Diamond Bridge Ave., Hawthorne, New Jersey 07506
Ph. 973-423-4444; FAX: 973-423-4459
Shanthitravel_99@yahoo.com

SATYAM SRIKONDA, PRESIDENT

Authorized ticket agent for all major airlines to
India, Europe, Asia and anywhere worldwide.

Full Service cruise, tours & travel service office -
part of American Express Travel Network of
1700 travel offices worldwide offering personalized attention.

Professional planning from beginning to end.
FEE-FREE AMERICAN EXPRESS TRAVELLERS CHECKS.
Comes with free passport and credit card replacement assistance.

Ask us about additional benefits and special prices available
for booking tours and cruises for American Express cardholders.
Experiences travel counselors to plan, assist and help
for group travel for families, reunions, and Continuing Education programs.

Hours:
Monday – Friday: 10 AM – 5 PM
Saturday: 10 AM – 12 Noon
For Emergencies Please Call:
973-423-4444 any time